


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

03.09.2026
గురువారం| రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 65
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రైతులు, టీచర్లపై కేసుల్ని ఎత్తివేత
# రైతులు, టీచర్లకు ఊరట

- సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- గతంలో ఆందోళనల్లో పాల్గొన్న వారిపై కేసులు
- కేసుల్ని ఎత్తేసిన విషయాన్ని గుర్తుచేసిన డీఎంకే

2లో..



# వరదలకు మీరే కారణం

- భారత్, చైనా, అమెరికాలను టార్గెట్ చేస్తున్న నేపాల్
- కర్బన ఉద్గారాలు విడుదల వల్లే వరదలు
- పరిహారం చెల్లించాలని అంతర్జాతీయంగా కోరుతున్న నేపాల్

**నేపాల్, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

నేపాల్ వరదలతో అతలాకుతలమైంది. వేయికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఇప్పుడు నేపాల్ దీనిపై రాజకీయాన్ని ప్రారంభించింది. ఘోర వరదలపై ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరిహారం కోరుతోంది. వరదలకు గ్రీన్ హౌజ్ ఉద్గారాలే కారణమని, ఇందులో భారత్, చైనా, అమెరికాల పాత్ర ఉందని, విపత్తు కారణంగా జరిగిన నష్టానికి క్లైమేట్ కాంపెన్సేషన్ ఇవ్వాలని నేపాల్ డిమాండ్ చేస్తోంది.

2లో..



## డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా
# భూమి కేటాయించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో రామ్మోహన్ నాయుడితో భేటీ
- రక్షణ మంత్రిని కోరిన సీఎం రేవంత్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు.

2లో..

## సీఈవోగా జితేంద్ర మిశ్రా

- అయోధ్య మందిరం తొలి సీఈవో
- ఆపరేషన్ సింధూర్' అధికారి

2లో..



**లక్నో, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

అయోధ్య రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను ఎంపిక చేశారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రామమందిర సీఈఓ పదవి కోసం వచ్చిన 5,585 దరఖాస్తులను వడపోసి, చివరకు జితేంద్ర మిశ్రా పేరును ఖరారు చేశారు.

# రేవంత్‌పై కొండా సురేఖ తిరుగుబాటు గళం

- సీఎంపైనే ముందు చర్యలు తీసుకోండి
- 'పదేళ్లు నేనే సీఎం' అనడంపై ఫైర్
- టికెట్లు నిర్ణయించే హక్కు సీఎంకు లేదు
- నా కూతురి మాటలకు నన్నెందుకు శిక్షిస్తారు?
- చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారు
- ఖర్గేకు నా వివరణ ఇచ్చాను
- సామాజిక న్యాయంపై అధిష్ఠానానికి ప్రశ్నలు
- రెడ్డి నేతలకు ఓ న్యాయం.. నాకో న్యాయమా?



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమను రెచ్చగొట్టినందుకే తన కూతురు సీఎంపై విమర్శలు చేసిందని, మహిళలు స్వతంత్రంగా బతకాలని రాహుల్ గాంధీ స్పష్టంగా చెబుతున్నారని గుర్తుచేశారు. తన కూతురు మాట్లాడిన మాటలకు తనపై చర్యలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేసిన సురేఖ, ఒకవేళ చర్యలు తీసుకోవాలనుకుంటే ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే తీసుకోవాలని సంచలన డిమాండ్ చేశారు. 'పదేళ్ల పాటు నేనే సీఎం' అని రేవంత్ రెడ్డి ప్రకటనలు చేయడం పార్టీ క్రమశిక్షణా రాహిత్యం కిందకురాదా అని ఆమె నిలదీశారు.

5లో..





తదుపరి ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి దక్కుతుందనేది నిర్ణయించడానికి సీఎంకు ఏం హక్కు ఉందని సురేఖ ప్రశ్నించారు. బహిరంగ వేదికలపై సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థుల పేర్లను ఎలా ప్రకటిస్తారని, దానికి ఆయనకు ఎవరు అధికారం ఇచ్చారని నిలదీశారు. అధిష్టానం నిర్ణయించాల్సిన టికెట్ల వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి ముందే తేల్చడం వల్లనే సమస్యలు వస్తున్నాయని, ఆయన వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉండటం వల్లే తన కూతురు స్పందించాల్సి వచ్చిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విమర్శలు, సీఎం ఏకపక్ష నిర్ణయాలపై ఢిల్లీ వేదికగా కొండా సురేఖ చేసిన ఈ తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయంలో కాకరేపుతున్నాయి.

**నాపై చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారు**

తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన భవిష్యత్తు మరియు తదుపరి చర్యలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నానని తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు.

# విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండవు

- ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నాం
- మంత్రి నారా లోకేష్
- మూడు హాస్టల్ భవనాలు ప్రారంభం

2లో..

**పల్నాడు, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం పల్నాడు జిల్లాలోని నర్సరావుపేటలో పర్యటించారు.



## 'జై కొట్టు' వీడియో వైరల్!

- జనసేన పార్టీ యువజన
- విభాగం గేయం ఆవిష్కరణ




5లో..

# యువత భవిత కోసం జై కొట్టాలి!

- ఇన్నాళ్లు లీడర్ల, పార్టీల కోసం జిందాబాద్ కొట్టాం
- జనసేన చీఫ్ పవన్ కల్యాణ్
- జీవితం చాలా విలువైంది
- కుటుంబం ఉందని గుర్తుపెట్టుకోండి
- అభిమానులకు పవన్ కళ్యాణ్ సూచన

2లో..




**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్, రాష్ట్ర ఆహార అండ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ 'జై కొట్టు' పేరుతో యువజన విభాగం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'జై కొట్టు' గేయాన్ని కూడా విడుదల చేశారు.

# రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు

- అమరావతి రైతులకు గుడ్‌న్యూస్
- 37 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు
- ఈ-లాటరీలో 17 మంది రైతులకు 37 ప్లాట్లు




# పదవిని ఎవరూ అడ్డుకోలేరు దానికి టైమ్ రావాలి అంతే..

- రాజగోపాల్ రెడ్డి
- పార్టీని కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోం
- వైఎస్సార్ ఆశయాల కోసం పనిచేస్తానని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తం చేస్తూ.. సమయం వచ్చినప్పుడు తనను ఎవరూ ఆపలేరని ఆయన వ్యాఖ్యానించారు.

2లో..

# నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను

- వైఎస్ జగన్ భావోద్వేగ ట్వీట్!
- వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- ఎప్పటికీ స్ఫూర్తిగానే ఉంటారని వెల్లడి




**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రిని స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో భావోద్వేగ సందేశాన్ని పోస్టు చేశారు. వైఎస్సార్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగానే ఉంటారని, ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ తనతోనే ఉంటాయని పేర్కొన్నారు.

2లో..

# బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారు

- కాళేశ్వరంలో కుట్ర జరిగితే
- అప్పుడెందుకు కేసు పెట్టలేదు
- మాజీ మంత్రి కడియం శ్రీహరి
- రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారు



# రైతులు, టీచర్లపై కేసుల్ని ఎత్తివేత

# రైతులు, టీచర్లకు ఊరట

**చెన్నై, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతులు, ఉపాధ్యాయులపై ఉన్న కేసుల్ని ఎత్తేశారు. జీవనోపాధి, హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా చేపట్టిన ఆందోళనలకు సంబంధించి 2021 మే నుంచి 2026 ఏప్రిల్ మధ్య నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకుంటున్నట్టు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. మానవతా దృక్పథంతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

గత ప్రభుత్వం రైతులు, టీచర్లపై అనేక కేసులు నమోదు చేసిందని విజయ్ విమర్శించారు. వారి ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డాయని, కేసుల కారణంగా ఇప్పటికీ వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, టీచర్ల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తిరువణ్ణామలై జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్‌కు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన ఆందోళనల్ని విజయ్ ప్రస్తావించారు. ఈ నిరసనల్లో కొందరు రైతులపై గుండాస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారని చెప్పారు.

పరందూర్‌లో ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా రైతులు చేసిన ఆందోళనల కేసులను కూడా ఉపసంహరిస్తామని విజయ్ ప్రకటించారు. విమానాశ్రయం కారణంగా వ్యవసాయ భూములు, నీటి వనరులు, జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కేసుల ఉపసంహరణ ప్రజాస్వామ్య హక్కులపై మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకాన్ని పెంచుతుందని విజయ్ అన్నారు.

అయితే, విజయ్ చర్యపై డీఎంకే స్పందించింది. రైతులపై కేసులు విత్ డ్రా చేసుకోవడం ఇదే తొలిసారి కాదని, తమ డీఎంకే ప్రభుత్వ హయాంలో నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన 5000కు పైగా కేసుల్ని ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. CAA, మూడు వ్యవసాయ చట్టాలు, కుడంకులం అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న వారిపై నమోదైన కేసులను తమ ప్రభుత్వం ఉపసంహరించిందని స్టాలిన్ పేర్కొన్నారు.

# రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు

**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంత రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది కూటమి ప్రభుత్వం.. అమరావతి ప్రాంత రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఈలాటరీ విధానంలో 17 మంది రైతులకు మొత్తం 37 ప్లాట్లను కేటాయించారు. ఇందులో 24 రెసిడెన్షియల్ ప్లాట్లు, 13 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు, కొండమరాజుపాలెం, లింగాయపాలెం గ్రామాలకు చెందిన రైతులకు ఈ ప్లాట్లను అధికారులు కేటాయించారు. గతంలో కేటాయించిన ప్లాట్ల విషయంలో వీధిపోటు, కోర్టు కేసులు, భూసేకరణ వంటి సమస్యలు తలెత్తడంతో ఆయా రైతులకు ప్రత్యామ్నాయంగా కొత్త రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈలాటరీ విధానం ద్వారా పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. సమస్యల కారణంగా పాత ప్లాట్లను వినియోగించుకోలేని రైతులకు కొత్త ప్లాట్లు కేటాయించడంతో వారి ప్రయోజనాలు కాపాడినట్లయింది.

# వరదలకు మీరే కారణం

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 26న భోటేకోషి నది పరివాహక ప్రాంతంలో సంభవించిన భారీ వరదలతో రసువా, సువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. నేపాల్ ప్రభుత్వం ఈ విపత్తును 'హిమాలయన్ సునామీ'గా అభివర్ణించింది.

ఈ వరదల్లో ఇప్పటివరకు 1,127 మంది మరణించగా.. మరో 3,900 మంది ఆచూకీ గల్లంతయ్యారు. నేపాల్, చైనా సరిహద్దుల సమీపంలో కొండచరియలు విరిగి పడి వరదలకు కారణమైందని నిపుణులు భావిస్తున్నారు. ఈ విపత్తుపై నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల ఎక్కువగా నష్టపోతున్న దేశాలకు, కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న దేశాలు పరిహారం చెల్లించాలని కోరారు. వరదల నష్టాన్ని కేవలం మానవతా సంక్షోభంగా చూడకుండా.. వాతావరణ న్యాయం, పరిహారం కోణంలో చూడాలని నేపాల్ కోరుతోంది. ఇది దాతృత్వం కాదని, చట్టపరమైన, నైతిక బాధ్యత అని నేపాల్ తన వాదనను అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తోంది.

ప్రస్తుత ప్రపంచంలో గ్రీన్ హౌస్ ఉద్గారాలు విడుదల చేస్తున్న దేశాల్లో చైనా, అమెరికా, భారత్ అగ్రస్థానాల్లో ఉన్నాయని నేపాల్ వాదిస్తోంది. అయితే, తలసరి ఉద్గారాల విషయంలో భారత అభివృద్ధి చెందిన దేశాల కంటే చాలా తక్కువ స్థాయిలో ఉంది. వరదల నష్టాలపై తమ వాదనల్ని వినిపించేందుకు నేపాల్ ప్రధాని బాలెన్ షా ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉంది. వరదల వల్ల జరిగిన నష్టం, పునరావాసం, పునర్నిర్మాణం కోసం నేపాల్ ఐక్యరాజ్యసమితి మద్దతుతో పనిచేస్తున్న 'ఫండ్ ఫర్ రెస్పాండింగ్ టు లాస్ అండ్ డ్యామేజ్'కు అధికారికంగా అభ్యర్థన పంపింది.

# పదవిని ఎవరూ అడ్డుకోలేరు

**– దానికి టైమ్ రావాలి అంతే..**

(మొదటి పేజీ తరువాయి)

తనకు పదవులపై వ్యక్తిగత ఆశ లేదని చెబుతూనే రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.సమయం వచ్చినప్పుడు దేవుడి దయతో వచ్చే పదవులను ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. తాను భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతాననే ధీమాను వ్యక్తం చేసిన ఆయన.. ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా తనను ఆపలేడని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవి వచ్చినా అది వ్యక్తిగత గౌరవంగా భావించబోనని.. సామాన్యుడికి దక్కిన బాధ్యతగా భావిస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. పదవిని కిరీటంగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు.ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్న నాయకులపై కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి నాయకులను ఆహ్వానించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పేర్కొంటూనే.. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న అసలు కార్యకర్తలను పక్కనబెట్టి పార్టీని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతామంటే బాగుండదు అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి అధికారం రావడం కోసం 10 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌ను కొందరు తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు గుప్పించిన రాజగోపాల్‌రెడ్డి.. తాను ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీని ఎవరూ కబ్జా చేయలేరని తేల్చి చెప్పారు. మునుగోడులోనే కాకుండా తెలంగాణలోని అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. తాను ప్రజా సమస్యలపైనే పోరాడుతున్నానని, పదవుల కోసం కాదని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ స్ఫూర్తి అని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వైఎస్ఆర్‌కు ఇప్పటికీ లక్షలాది మంది అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ ఆశయాల కోసం పనిచేస్తానని.. ఆయన పాలనలో పేదలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. మళ్లీ రాజశేఖర్‌రెడ్డి యుగం రావాలని ఆకాంక్షించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నదే తన ఆలోచన అని చెప్పారు. ఇచ్చిన హామీల అమలు, అవినీతికి వ్యతిరేకంగా, పేదలకు అండగా ఉండేందుకు తాను పోరాడతానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను

(మొదటి పేజీ తరువాయి)



'నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను. మీరు ఎప్పటికీ నా స్ఫూర్తి. మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. తండ్రిపై తనకున్న అనుబంధాన్ని, అభిమానాన్ని మరోసారి వ్యక్తం చేశారు. అంతకుముందు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జగన్ నివాళులు అర్పించారు. తండ్రి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్ కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. వైఎస్సార్ చేసిన సేవలను, ఆయన పాలనలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ఆయన వర్ధంతిని కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

# యువత భవిత కోసం జై కొట్టాలి!




(మొదటి పేజీ తరువాయి)

యువజన విభాగం ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జనసేనాని పవన్ కళ్యాణ్ ఆడియో సందేశాన్ని పంపించారు. యువత రాజకీయ, సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కేవలం నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేయడం కాకుండా.. సమాజం, యువత భవిష్యత్తు, మార్పు కోసం పనిచేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. 'దేహి అని దేనికోసం చేతులు చాపవద్దు.. దేశం కోసం పని చేసే చేతులు కావాలి' అంటూ యువతలో సేవాభావం, స్వావలంబన పెరగాలని ఆకాంక్షించారు. 'నేను ఎక్కడ ఉన్నాను అని ప్రశ్నార్థకం వద్దు.. ఇక్కడే ఉన్నాను అని అస్తిత్వం పిడికిలి కావాలి' అని పేర్కొన్నారు.

ఇన్నాళ్లూ నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేశామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇకపై యువత కోసం, వారి భవిత కోసం, మార్పు కోసం, ప్రజల తీర్పు కోసం 'జై కొట్టు' అని నినదించాలని పిలుపునిచ్చారు. పట్టు వదలని ప్రజల కోసం పోరాడే సేనకు జై కొట్టాలని, సమాజంలో మార్పు కోసం యువత ముందుండాలని ఆకాంక్షించారు. యువతలో రాజకీయ చైతన్యంతో పాటు బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించాలని తన సందేశం ద్వారా స్పష్టం చేశారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'జై కొట్టు' లోగో, గేయం ఆవిష్కరణతో పార్టీ యువజన విభాగానికి అధికారికంగా కొత్త రూపం లభించింది. యువతను మరింతగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందించేలా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా 'జై కొట్టు'ను ఉపయోగించుకోవాలని జనసేన భావిస్తోంది.

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోపవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ..కరెంట్ షాక్ కొట్టి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అల్లవరం మండలంలోని ఓడలరేవులో ఈ ఘటన చోటుచేసుకుంది. బెండమూర్లంకకు చెందిన ప్రేమ్ కుమార్ అనే 23 ఏళ్ల యువకుడు ఓడలరేవులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. అనంతపురంలోని పెనుగొండలో ఉన్న కియా కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. అయితే తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు స్వగ్రామం వచ్చిన ప్రేమ్ కుమార్.. మంగళవారం రాత్రి వేళ ఫ్లెక్స్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల వారు వెంటనే అతణ్ని ఆస్పత్రికి తరలించగా.. ప్రేమ్ కుమార్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం ప్రేమ్ కుమార్ మృతదేహాన్ని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పవన్ కళ్యాణ్ అభిమానుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

**అమలాపురం ఘటన.. కలిచివేసిందన్న పవన్ కళ్యాణ్..**

మరోవైపు అమలాపురం ఘటన కలిచివేసిందని పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ.. ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌కు గురై రోళ్ల ప్రేమ్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందని ట్వీట్ చేశారు. ప్రేమ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని.. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రేమ్ కుమార్ కుటుంబానికి అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. జీవితం ఎంతో అమూల్యమైనదని.. వేడుకలు, ఉత్సవాల సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే సమయంలో కుటుంబం ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఎత్తైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసే సమయంలో, ర్యాలీల్లో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

**నిర్మాత ఎస్‌కేఎన్ ఆర్థిక సాయం..**

మరోవైపు పవన్ కళ్యాణ్ అభిమాని మృతిపై నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించారు. రూ.2 లక్షలు పరిహారం ప్రకటించారు. తాను కూడా ఒకప్పుడు బ్యానర్లు కడుతూ, అభిమానిగా మొదలుపెట్టి ఈ స్థాయికి చేరుకున్నానన్న ఎస్కేఎన్.. ఒక అభిమాని బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజున ఆయన అభిమాని ప్రేమ్ కుమార్.. ఇలా దూరం కావటం బాధ కలిగించిందని ట్వీట్ చేశారు. ప్రేమ్ కుమార్ కుటుంబానికి ఓ అభిమానిగా, ఒక మనిషిగా అండగా నిలబడాలని నిర్ణయించుకున్నానని.. వారి బాధను తీర్చలేకపోయినా, తన వంతుగా రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎస్‌కేఎన్ ప్రకటించారు.

# డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా భూమి కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో బిజీ బిజీగా గడుపుతున్నారు. ఓవైపు కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చూసుకుంటూనే, మరోవైపు.. కేంద్రమంత్రులతో సమావేశం అవుతున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రక్షణ ప్రాజెక్టుకు భూమి కేటాయింపు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు, అలాగే హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026, రక్షణ ఎక్స్‌పో2026పై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో చర్చించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.

రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులతో పాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, అత్యాధునిక భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశవ్యాప్తంగా రక్షణ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రక్షణ ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర రక్షణశాఖ సహకారం అందించాలని కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు సహకరించాలని.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవోకు చెందిన ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ డిఫెన్స్ టెక్నాలజీని ప్రదర్శించేలా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించాలని కోరారు. మరోవైపు.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపైనా సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. ఈ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఇప్పటికే అంగీకరించిందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల పాటు కేటాయించే ప్రతిపాదన ఉందని తెలిపారు. అవసరమైతే మరో 2 సార్లు లీజును పొడిగించుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.

# సీఈవోగా జితేంద్ర మిశ్రా



(మొదటి పేజీ తరువాయి)

వైమానిక దళంలో మిశ్రా 39 ఏళ్ల పాటు సేవలందించారు. ట్రస్ట్ ఛైర్మన్ నృత్య గోపాల్‌దాస్ నివాసంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఈఓ ఎంపిక కమిటీ తుది నివేదికను సమర్పించింది. ముగ్గురు పేర్లను ప్రతిపాదించగా.. చివరకు జితేంద్ర మిశ్రా సీఈఓగా ఖరారు చేశారు.

జితేంద్ర మిశ్రా భారత వైమానిక దళంలో అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో వెస్ట్రన్ కమాండ్‌కు చీఫ్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మిశ్రా పదవీవిరమణ చేశారు. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో సీఈఓగా ఎంపికైన ఆయనపై రామమందిర నిర్వహణ, ఆర్థిక జవాబుదారీతనాన్ని పటిష్టం చేసే బృహత్తరమైన బాధ్యత ఉంటుంది.

ఆపరేషన్ సింధూర్ సమయంలో ఆయన చేసిన విశిష్ట సేవకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సర్వోత్తమ్ యుద్ధ సేవా పతకాన్ని ప్రదానం చేశారు. యుద్ధం, వివాదం లేదా సైనిక సంఘర్షణల సమయంలో అత్యున్నత స్థాయి విశిష్ట సేవలకు ఈ పతకాన్ని అందజేస్తారు. ఇది భారతదేశంలోని అత్యంత అరుదైన సైనిక పురస్కారాలలో ఒకటి. మిశ్రా నియామకం ద్వారా కార్యాచరణ ప్రణాళిక, సమన్వయం, లాజిస్టిక్స్, భారీ విభాగాలు/ బలగాల నిర్వహణలో విస్తారమైన అనుభవం ఉన్న ఒక సీనియర్ నాయకుడి సేవలు ఈ ట్రస్ట్‌కు లభించనున్నాయి.

ఇటీవల ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మిశ్రా ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన వైమానిక దాడుల గురించి మాట్లాడారు. పాకిస్థాన్ భూభాగంలోపలికి భారత దళాలు చొచ్చుకెళ్లి, లక్ష్యాలపై ఎలా దాడిచేశాయో వివరించారు. 'షూట్' (కాల్చండి) అనే చిన్న కార్యాచరణ ఆదేశం వచ్చిన వెంటనే, సుమారు 314 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక లక్ష్యాన్ని ఎలా ధ్వంసం చేశారో ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ గురించి వివరించిన ఆయన.. పక్కా ప్రణాళిక, ఖచ్చితత్వం, సాంకేతికత, సాయుధ దళాలలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం ప్రాముఖ్యతను విశ్లేషించారు. అయితే, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన కొన్ని కీలక వివరాలు ఇప్పటికీ రహస్యంగానే ఉన్నాయి.

ఇక, జితేంద్ర మిశ్రా ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవిరియా జిల్లాలోని భోపత్‌పురా గ్రామానికి చెందిన సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి లెక్చరర్‌గా పనిచేశారు. రామమందిర సీఈఓగా మిశ్రా రోజువారీ పరిపాలన, యాత్రికుల సౌకర్యాలు, ఆర్థిక ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయం, భద్రతాపరమైన పర్యవేక్షణ, పెద్ద ఎత్తు దార్మిక వేడుకల నిర్వహణ బాధ్యతలను చూసుకునే అవకాశం ఉంది.

# బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. బుధవారం లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.

**కవిత లేవనెత్తిన అంశాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..**

దోచుకున్న సొత్తును లెక్కపెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరంలోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.

**ప్రభుత్వ సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారు..**

కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబం అయ్యిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా కూడా తెలంగాణ ప్రజలు బాగుపడలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

# విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)



నర్సరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నూతనంగా నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. నర్సరావుపేట జేఎన్‌టీయూకే కాలేజీలో నూతన హాస్టళ్ల ప్రారంభంతో విద్యార్థులకు వసతి సమస్యలు మరింత తగ్గనున్నాయని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మించిన గదులు, ఇతర మౌలిక సదుపాయాలపై మంత్రి లోకేశ్.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మొత్తం 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వసతి కల్పించేలా హాస్టళ్లను ప్రభుత్వం రూపొందించింది. గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన ఈ మూడు హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.70 కోట్లను ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్ టీయూకే వైస్ ఛాన్స్‌లర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ తర్వాత హాస్టల్ మొత్తం కలియతిరిగి వసతులను మంత్రి లోకేశ్ పరిశీలించారు. అనంతరం రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన వసతి గృహాలను మంత్రి లోకేశ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ భవనాలను అత్యాధునిక సదుపాయాలతో ఏపీ ప్రభుత్వం నిర్మించింది.

# 'కాక్రోచ్'లపై కేసులన్నీ కొట్టివేత..

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జులై 2025 మధ్య దేశంలో వేర్వేరుచోట్ల జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో దేశ రాజధానిలో ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజు జరపతలపెట్టిన ర్యాలీని విరమించుకుంటున్నట్లు సీజేపీ ప్రకటించింది. నిరసనలతో ముడిపడిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాల్సిందిగా కేంద్రంతోపాటు మహారాష్ట్ర, అస్సాం, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు కోరుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మంగళవారం తెలిపారు. దీంతో సీజేఐ తన నిర్ణయాన్ని ప్రకటించడంతోపాటు.. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలని, దానికోసం దేశవ్యాప్త విధానాన్ని రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించారు. ''యువ నిరసనకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, వారిపై న్యాయచర్యను ముగిస్తున్నాం. సంపూర్ణ న్యాయం






చేయడానికి 142వ అధికరణం ద్వారా రాజ్యాంగం మాకు ఇచ్చిన అసాధారణ అధికారాన్ని వినియోగిస్తున్నాం'' అని ప్రకటించారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనల్లో పాల్గొన్నవారిలో తీవ్ర నేరాభియోగాల చరిత్ర ఉన్న 2,873 మందిపై మాత్రం కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి కేంద్ర అభ్యర్థన మేరకు దిల్లీ పోలీసులను అనుమతిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. భౌతిక దాడికి, ఆస్తుల విధ్వంసానికి పాల్పడేవారిపై కేసులు నమోదు చేయవచ్చని స్పష్టంచేసింది. జులై 2025 మధ్య సీజేపీ నిరసనలకు సంబంధించి వేరే ఏ రాష్ట్రంలోనైనా కేసులు నమోదైతే అవి సుప్రీంకోర్టు ముందు లేకపోయినా వాటినీ మూసివేసినట్లు పరిగణించాలని తేల్చిచెప్పింది.

ఆందోళనను రద్దు చేసుకుంటున్నట్లు కోర్టులో ప్రకటన ధర్మాసనం ముందు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ హాజరై ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. 5న జరపతలపెట్టిన తమ ఆందోళనను విరమించుకుంటున్నట్లు ప్రకటనను చదివి వినిపించారు. కోర్టు తీర్పు పూర్తిస్థాయిలో అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయపక్షాల ప్రకటనల్ని కోర్టు నమోదు చేసుకుంది. అవి తమ వాగ్దానానికి కట్టుబడి ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేసింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మహారాష్ట్రలో స్పందిస్తూ తమకు పరిపూర్ణంగా న్యాయం జరిగిందన్నారు. పోరాటంలో పాల్గొన్నవారికి, ఆత్మహత్యలతో ప్రాణాలు తీసుకున్నవారి కుటుంబాలకు న్యాయం చేసినందుకు కోర్టుకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీలతో ఇకపై ఏ విద్యార్థీ ప్రాణాలు కోల్పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. యువత సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, దానిలో భాగంగానే వారికిచ్చిన మాట ప్రకారం కేసులను ఉపసంహరించుకున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు.

## మమతా బెనర్జీ మేనకోడలు అనుమానాస్పద మృతి

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనకోడలు బృష్టి ముఖర్జీ ఘటక్ (28) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. రాంపూర్‌హట్‌లోని తమ నివాసంలో మంగళవారం మధ్యాహ్నం ఉరి వేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా..అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బృష్టి ముఖర్జీ కుల కేసు విచారణ దశలో ఉందని కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో కొంత కాలంగా ఆమె డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. బృష్టి కూడా అక్రమంగా ఉద్యోగం పొందారని ఆరోపణలు వచ్చాయి. ఆ నియామకాలను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో ఆమె ఉద్యోగం కోల్పోయారు.



## "వైద్యులపై దాడికి పాల్పడినవారికి బెయిలు బంద్": సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



వైద్య వృత్తిలో ఉంటూ రోగులకు సేవలు అందించే ఆరోగ్య సంరక్షణ సిబ్బందిపై దాడులకు తెగబడేవారి పట్ల న్యాయస్థానాలు ఎలాంటి ఉపేక్ష వహించబోవని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. వైద్య సేవలు అందించే వారి పట్ల కనీస గౌరవం, మర్యాద చూపని వ్యక్తులకు బెయిలు పొందే అర్హత ఎంతమాత్రమూ ఉండదని సుప్రీంకోర్టు అత్యంత ఘాటుగా స్పష్టం చేసింది. సమాజానికి రక్షణగా నిలిచే వైద్యులపై భౌతిక దాడులు చేసే సంస్కృతిని తీవ్రంగా పరిగణించాల్సిందేనని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బాంబే హైకోర్టు గతంలో జారీ చేసిన వివిధ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు సమగ్ర విచారణ జరిపి ఈ సంచలన తీర్పును ఇచ్చింది.


**అసలేం జరిగిందంటే..?**

మహారాష్ట్రలోని థాణె మున్సిపల్ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు వైద్య సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్ మాత్రే, అతడి అనుచరులు దౌర్జన్యానికి దిగారు. ఈ వికృత దాడికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో బాంబే హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుకు సంబంధించి స్థానిక ట్రయల్ కోర్టు నిందితుడు రమేశ్ మాత్రేకు మంజూరు చేసిన బెయిలును జులై 18వ తేదీన బాంబే హైకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. అంతేకాకుండా నిందితుడైన కార్పొరేటర్ పోలీసుల ఎదుట వెంటనే లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.

సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కఠిన వైఖరి ఆ తర్వాత ఆగస్టు 7వ తేదీన బాంబే హైకోర్టు రమేశ్ మాత్రేతో పాటు ఇతర నిందితులకు కొన్ని అత్యంత కఠినమైన నిబంధనలతో బెయిలు మంజూరు చేసింది. అయితే హైకోర్టు విధించిన ఆ కఠిన షరతులను నిందితుడు మాత్రే అంగీకరించకుండా సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. మరోవైపు హైకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించడాన్ని, ట్రయల్ కోర్టు ఇచ్చే బెయిలుపై స్టే విధించడాన్ని కూడా అతడు సుప్రీంలో ప్రశ్నించాడు.

ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతూ.. బాంబే హైకోర్టు తీసుకున్న నిర్ణయం పూర్తిగా సమర్థనీయమైనదని కొట్టిపారేసింది. మహిళా డాక్టర్‌తో సహా పలువురు వైద్యులపై బహిరంగంగా దాడికి పాల్పడటం దారుణమైన చర్య అని పేర్కొంది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో నిందితుల పట్ల ఎలాంటి మెతక వైఖరి అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

## అమెరికాలో లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి కుటుంబం కోసం ఇండియాకు వచ్చేసిన భారతీయ యువతి




అమెరికాలో ఉన్నత విద్య, తర్వాత మంచి జీతంతో ఉద్యోగం. ఇది ప్రపంచంలో చాలా మంది యువత కనే కల. కానీ, ఓ యువతి మాత్రం ఆరంకెల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి, ఇండియాకు వచ్చేసింది. అక్కడ జీతం, విలాసవంతమైన జీవితం ఉన్నా.. సాయంత్రమైతే పలకరించేవారు ఉండరని, ఈ రోజు ఎలా గడిచింది? అని అడిగే వ్యక్తి కనపించరని అది తనను ఎంతో వేదనకు గురిచేసిందని ఆమె అన్నారు. అందుకే సొంత దేశం వచ్చేయాలని నిర్ణయించుకున్నానని ఆమె వివరించారు. ఆమె గురుగ్రామ్‌కు చెందిన దిశ లంబ.

అమెరికాలో ఆరంకెల జీతం వచ్చే ఉద్యోగం, లాటరీలో లభించిన హెచ్ 1బీ (H1B) వీసా.. వీటన్నింటినీ వదులుకుని కుటుంబం కోసం ఓ భారతీయ యువతి స్వదేశానికి తిరిగొచ్చేశారు. కేవలం కుటుంబానికి దగ్గరగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు గురుగ్రామ్‌కు చెందిన 28 ఏళ్ల దిశా లంబా వెల్లడించారు. ఉన్నత విద్య కోసం 2021లో అమెరికాకు వెళ్లిన ఆమె.. న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం 'సీవీఎస్ హెల్త్' (CVS Health) సంస్థలో డేటా సైంటిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 'బిజినెస్ ఇన్‌సైడర్'తో మాట్లాడిన లంబా.. అమెరికాలో ఉండటం వల్ల తాను ఎంతో స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో మారగలిగానని చెప్పారు. అయితే, ఆ స్వేచ్ఛ వెనుక మాటల్లో చెప్పలేని ఒక వేదన ఉందన్నారు. ''అమెరికాలో నాకు అద్భుతమైన జీవితం ఉంది. కానీ కుటుంబానికి దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో మే 2026లో భారత్‌కు తిరిగిరావాలని నిర్ణయించుకున్నాను.. అలాగే హెచ్ 1బీ వీసాలపై ఆంక్షలు నాకు నచ్చలేదు'' అని లంబా తెలిపారు.

**అమెరికా నుంచి స్వదేశానికి**

''నేను ఇండియాలో పుట్టి పెరిగాను.. నేను ఇంట్రోవర్ట్ కావడం వల్ల కంఫర్ట్‌గా ఉండే చోట ఉండటానికే ఇష్టపడేదాన్ని.. కానీ మా నాన్న నన్ను మాస్టర్స్ చదువు కోసం అమెరికాకు పంపించాలని కలలు కనేవారు... ఆయన స్నేహితుల పిల్లలు అమెరికా, యూకేలకు వెళ్లి ఉన్నతంగా ఎదిగారు.. నేను కూడా అలాగే కావాలని కోరుకున్నారు'' అని ఆమె చెప్పారు. ''పనిచేసే సంస్థ నా H1B వీసాకు స్పాన్సర్ చేసింది.. నేను మార్చి 2026లో లాటరీలో ఎంపికయ్యానని నాకు తెలియజేశారు. అయితే, చివరికి భారతదేశానికి తిరిగి రావాలనేది నా ప్రణాళిక, ఆ సమయానికే నేను ఆ నిర్ణయం తీసుకున్నాను'' అని ఆమె అన్నారు. ''సాయంత్రం 5 కాగానే రోజు ఎలా గడిచింది అని అడిగేందుకు పక్కన ఎవరూ ఉండేవారు కారు. నాకు స్నేహితులు ఉన్నారు, కానీ స్నేహితులు ఎప్పటికీ కుటుంబం కాలేరు. నా బెస్ట్ ఫ్రెండ్ అయిన మా అమ్మతో మాట్లాడటానికి టైమ్ జోన్ తేడాల ప్రకారం వీడియో కాల్స్ ప్లాన్ చేసుకోవాల్సి వచ్చేది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ 1బీ వీసా వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దాని ఆంక్షలు తనకు నచ్చలేదని లంబా అన్నారు. హెచ్ 1బీ వీసాపై ఉంటే వేరే కంపెనీకి మారడం, అదనపు ఆదాయ మార్గాలను వెతుక్కోవడం లేదా కెరీర్‌లో చిన్న విరామం తీసుకోవడం చాలా కష్టమని ఆమె తెలిపారు. ''ఒక్కసారి హెచ్ 1బీ వీసా వచ్చిందంటే అమెరికా దాటి వెళ్లి మళ్లీ రావడానికి కొత్త వీసా స్టాంపింగ్ అవసరం. భారత్‌లో స్టాంపింగ్ అపాయింట్‌మెంట్ పొందడం పెద్ద ప్రహసనం. సాధారణంగా హెచ్ 1బీ వీసాను దశల వారీగా ఇస్తారు కాబట్టి, నిరంతరం వీసా వ్యవహారాలను మేనేజ్ చేసుకోవాల్సి వస్తుందని అనిపించింది'' అని ఆమె వివరించారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత గురుగ్రామ్ చేరుకుని, ప్రస్తుతం తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి ఉంటున్నారు. ఉపాధి వీసా నిబంధనలు లేకపోవడం వల్ల లభించిన స్వేచ్ఛతో ఆమె రెండు నెలల కెరీర్ బ్రేక్ తీసుకున్నారు. ప్రస్తుతానికి చేతిలో ఎలాంటి ఆఫర్ లేకపోయినప్పటికీ, అమెరికాకు సమానమైన కెరీర్ అవకాశాలు భారత్‌లో కూడా ఉన్నాయని లంబా స్పష్టం చేశారు.

**హెచ్-1బీ వీసా జారీలో కఠిన నిబంధనలు**

**గత నెలలో అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (DHS) హెచ్-1బీ వీసా ఫీజును 1,03,265 డాలర్లుకి పెంచాలని ప్రతిపాదించింది. ఒకవేళ ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే.. అమెరికాలోని విదేశీయులకు ముఖ్యంగా హెచ్-1బీ వీసా లబ్ధిదారులలో 70 శాతానికి పైగా ఉన్న భారతీయులకు ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి.**


**ఫీజు భారీగా పెంపుతో పాటు ఉద్యోగం మారేందుకు ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించాలని కూడా DHS ప్రతిపాదించింది. ఈ నిబంధన అమలు చేస్తే ఉద్యోగం పోయిన వెంటనే వారు అమెరికాను విడిచిపెళ్లాల్సి వస్తుంది. లేదంటే స్టేటస్ ఉల్లంఘనలను ఎదుర్కొంటారు. అలాగే, హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇచ్చే వర్క్ పర్మిట్లను రద్దు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ఇదే జరిగితే పదేళ్లకు పైగా అర్హులైన H-4 వీసాదారులు చట్టబద్ధంగా పనిచేయడానికి ఉన్న అవకాశాన్ని తొలగించినట్లవుతుంది. H-4 వర్క్ పర్మిట్ ఉన్నవారిలో ఎక్కువ మంది భారతీయులే కావడంతో ఈ చర్యల వల్ల భారతీయ నిపుణులపైనే అత్యధిక ప్రభావం పడే అవకాశం ఉంది.**

## నేడు అయోధ్య రామాలయ తొలి సీఈవో పేరు వెల్లడి



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవో ఎవరనేది శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు బుధవారం ప్రకటించనుంది. ట్రస్టు అధ్యక్షుడు నృత్య గోపాల్‌దాస్ నివాసంలో మధ్యాహ్నం నుంచి జరిగే సమావేశానికి సీఈవో ఎంపిక కమిటీ తుది జాబితాను సమర్పిస్తుంది. ముగ్గురి పేర్లతో కూడిన ఆ జాబితా నుంచి ఒక పేరును ట్రస్టు ఖరారు చేస్తుంది. అలాగే కమిటీ ప్రధాన కార్యదర్శితోపాటు ఇద్దరు సభ్యుల పేర్లను కూడా వెల్లడించనున్నారు. సీఈవో ఎంపిక కమిటీ సభ్యులైన రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కొహ్లీ, రిటైర్డ్ ఎల్జీ విష్ణుకాంత్ చతుర్వేదితోపాటు నిపుణుడైన మరో సభ్యుడు సురేశ్ హావ్డే ఇప్పటికే అయోధ్యకు చేరుకున్నారు. సీఈవో పోస్టు కోసం అందిన 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ చివరి దశలో 16 మందిని ఇంటర్వ్యూ చేసినట్లు జస్టిస్ ప్రమోద్ కొహ్లీ మీడియాకు తెలిపారు. అయోధ్య రామాలయంలో కానుకలు, విరాళాల చోరీపై వచ్చిన ఆరోపణలతో తలెత్తిన వివాదం నేపథ్యంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్‌మిశ్ర తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ట్రస్టు సభ్యుడిగా ఉన్న విమలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్ర మరణంతో మొత్తం మూడు పదవులకు ఖాళీ ఏర్పడింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఆరెస్సెస్ అనుయాయి జగదీశ్ ఆఫ్లే రామాలయ నిర్మాణ సమయంలో ప్రాజెక్ట్ మేనేజరుగా వ్యవహరించారు. ఆలయ ట్రస్టు తొలి కార్యదర్శిగా ఈయన పేరే ఖరారు కానుంది. జగదీశ్ ఐఐటీ బాంబే నుంచి ఎంటెక్ చేశారు. వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ లాల్ బాగ్డాకు సైతం ట్రస్టులో చోటు లభించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## 77% పాఠశాలల్లో బాలికలకు విడిగా శౌచాలయాలు



బడుల్లో బాలబాలికలకు వేర్వేరుగా శౌచాలయాలు ఉండాలన్న ఆదేశం దేశంలో 77% మేర అమలవుతోందని, మిగిలినచోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇలాంటివి 30,458 నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించింది. పాఠశాలల్లో శానిటరీ నాప్కిన్లు సమకూర్చడాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రారంభించాయని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనానికి తెలిపింది. ఈ ఏడాది జనవరిలో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గత త్రైమాసికంలో ప్రభుత్వం ఏమేం చేసిందో వెల్లడించే నివేదికను అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి సమర్పించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కోర్టు ఆదేశాల అమలుకు చేతులు కలిపి ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలంటూ తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 29కి వాయిదా వేసింది.

## అంత్యక్రియలు పూర్తైన నెలరోజులకు తిరిగొచ్చిన కుమారుడు



ఒడిశాలోని దేంకానాల్ జిల్లా బార్షింగాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. తమ కుమారుడు తప్పిపోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి.. స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అనుకొని భావించి అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. నెల తర్వాత వారి ఇంటికి తిరిగి రావడం చూసి కుటుంబీకులు సహా గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. బార్షింగా గ్రామానికి చెందిన సనాతన్ నాయక్ (29)కు మానసిక ఆరోగ్యం బాగాలేదు. తరచూ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. కానీ, జులైలో అలా వెళ్లిన అతడు మళ్లీ రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సమీపంలోని కుసువా గ్రామంలో వరద నీటిలో కొట్టుకువచ్చిన ఓ మృతదేహం సనాతన్‌దేనని పోలీసులు భావించి అతడి కుటుంబీకులకు అప్పగించారు. దీంతో వాళ్లు మృతదేహం తమ కుమారుడిదే అనుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఇవన్నీ పూర్తైన నెల రోజులకు సనాతన్ ఇంటికి తిరిగి రావడంతో వారంతా ఆశ్చర్యపోయారు. అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్‌కు బెదిరింపు



ఉగ్రవాదుల చేతిలో హతమవుతారంటూ కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్‌కు మంగళవారం బెదిరింపు వచ్చినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయనకు మరింత భద్రత కల్పించాలని కేంద్ర హోంశాఖను ఆ కార్యాలయం కోరింది. తనకు వచ్చిన బెదిరింపుపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని లోక్ జనశక్తి పార్టీ (ఆర్) అధినేత పాస్వాన్ ఈ సందర్భంగా కోరారు. ఆయన ప్రస్తుతం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిగా పని చేస్తున్నారు. ''కరుడుగట్టిన ఉగ్రవాదుల చేతిలో నువ్వు త్వరలో హతమవుతావు'' అంటూ కేంద్రమంత్రికి సందేశం అందిందని ఆయన అదనపు వ్యక్తిగత కార్యదర్శి కేంద్ర హోం శాఖకు లేఖ ద్వారా వివరించారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | రంగారెడ్డి
03.09.2026





## 'జన్‌ధన్' ఆర్థిక భాగస్వామ్యానికి పునాది

"భారతీయులందరినీ అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు పన్నెండేళ్ల క్రితం 2014 ఆగస్టు 28న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) పథకం ప్రారంభమైంది. సామాజిక మార్పునకు ఎంతో ఉపయోగపడిన పథకమిది. ఈరోజు వెనక్కి తిరిగి చూసుకుంటే, ఎన్ని ఖాతాలు ప్రారంభించాం అనేది కాకుండా ఆర్థిక సమ్మిళితత్వం అనే భావన ఎలా మారిందనేదే ముఖ్యం."

జన్‌ధన్ కింద బ్యాంకుల్లో దాదాపు 59 కోట్ల ఖాతాలు ప్రారంభించారు. వీటిలో రూ.3 లక్షల కోట్లకు మించి డిపాజిట్లు ఉన్నాయి. లబ్ధిదారుల్లో సగానికి పైగా మహిళలే. దాదాపు అయిదింట నాలుగు వంతుల ఖాతాలు గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల శాఖల్లో ఉన్నాయి. ఈ గణాంకాలు అధికారిక బ్యాంకింగ్ సేవల విస్తరణ ఎంత విజయవంతంగా జరిగిందో తెలియజేస్తున్నాయి. జన్‌ధన్ విజయం సాధించడంలో ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థదే కీలక పాత్ర. పీఎంజేడీవై ఖాతాల్లో దాదాపు 80శాతం ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ పథకంలో మరింత చురుగ్గా భాగమైంది. ప్రస్తుతం ఎస్‌బీఐలో దాదాపు 16 కోట్ల పీఎంజేడీవై ఖాతాలున్నాయి. ఇవి గతంలో అధికారిక ఆర్థిక సేవలు పరిమితంగా ఉన్న లేదా అసలే అందుబాటులో లేని అనేక ప్రాంతాలకు బ్యాంకింగ్‌ను చేరువ చేశాయి. ఈ ఖాతాల సంఖ్యకంటే మరింత ముఖ్యమైన మార్పు బ్యాంకింగ్ సంబంధాల స్వభావంలో వచ్చిందనేది నా అభిప్రాయం.

**సామాన్యులూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి...**

జన్‌ధన్ ప్రారంభమైనప్పుడు, ఈ ఖాతాలను జీరో బ్యాలెన్స్ ఖాతాలుగా పేర్కొనేవారు. ఇప్పుడు చూస్తే పీఎంజేడీవై ఖాతాల్లో సగటు నిల్వ రూ.5,000ను మించింది. అంటే ఈ ఖాతాలు అతి సామాన్యులనూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం మాత్రమే కాదు; వారు కూడా పొదుపు చేయడానికి, ఆదాయాన్ని స్వీకరించడానికి, చెల్లింపులు చేయడానికి ఉపయోగపడుతున్నాయి. ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని ఏర్పరచుకోవడానికి బ్యాంకింగ్‌ను సామాన్యులూ వినియోగిస్తున్నారు. ఈ పరిణామాన్ని చాలా దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది. కొత్త ఖాతాదారును బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడంలో తొలి అడుగు ఎంత కష్టమైనదో నాకు తెలుసు. జన్‌ధన్ రూపంలో ఇది నెరవేరింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి సరళమైన బీమా, పింఛన్ ఉత్పత్తుల ద్వారా ఆర్థిక సమ్మిళితత్వం బ్యాంకు ఖాతాను మించి విస్తరించింది. ఇవి కుటుంబాలకు మెరుగైన ఆర్థిక రక్షణతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక పునాది అందిస్తున్నాయి. ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి వంటి కార్యక్రమాల ద్వారా ఒనగూడుతున్న సమ్మిళిత రుణ సౌకర్యం కూడా ఈ ప్రయాణంలో ముఖ్యమైన భాగంగా మారింది. సంప్రదాయ బ్యాంకింగ్ సేవల ద్వారా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులతో పాటు అట్టడుగు వర్గాలకూ అధికారిక రుణాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఈ పథకాలు సాయపడుతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లొచ్చు. దేశంలో డిజిటల్ ఆర్థిక మౌలిక సదుపాయాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండటం దీనికి ఉపకరిస్తోంది. ఆర్థిక కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నా, ఇప్పటికీ అవసరమైన ధ్రువీకరణలు, తగినంత ఆర్థిక సమాచారం లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి అంచనా వేయడం గతంలో అధికారిక ఆర్థిక వ్యవస్థకు కష్టంగా ఉండేది.

పీఎంజేడీవైలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 32 కోట్ల మందికి పైగా మహిళలు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. సొంత బ్యాంకు ఖాతా వల్ల, ఒక మహిళ ఆర్థిక వ్యవస్థతో వ్యవహరించే విధానమే మారిపోతుంది. ఆదాయాన్ని స్వీకరించడానికి, పొదుపు చేసుకోవడానికి, రుణం పొందడానికి, చివరికి ఒక వ్యాపారాన్ని ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి సొంత ఖాతా పునాది అవుతోంది. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)తో అనుసంధానం, మహిళలను మరింత శక్తిమంతంగా మారుస్తోంది. ప్రస్తుతం ఎస్‌హెచ్‌జీల్లో 10 కోట్లమందికి పైగా మహిళలు ఉన్నారు. ఇందులో పది శాతానికి పైగా మహిళలకు ఎస్‌బీఐ మద్దతు ఇస్తోంది. రైతులు, చిన్న వ్యాపారులు, స్వయంఉపాధి పొందుతున్న వారికీ ఇదే వర్తిస్తుంది. మొత్తం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో 1.8 లక్షలకు పైగా శాఖలతోపాటు, 17లక్షల మందికి పైగా బిజినెస్ కరస్పాండెంట్లు ఉన్నారు. వీరిద్వారా అధికారిక బ్యాంకింగ్ సేవలు ప్రజలకు చేరుతున్నాయి. అయితే ఆర్థిక పథకాలు, సేవలు సరళంగా, సురక్షితంగా, అందుబాటు ధరల్లో లభించేలా చూడటమే కీలకం. ప్రజలకు ఆర్థిక సేవలు అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ ప్రజా మౌలిక వసతులు ఇందులో ముఖ్యం. అకౌంట్ అగ్రిగేటర్, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్, డిజిటల్ చెల్లింపులు, భద్రతా చర్యల వంటివి ఖాతాదారు ఆర్థిక సామర్థ్యాన్ని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి సాయపడుతున్నాయి. ఇందువల్లే కొత్తగా రుణం తీసుకునే వ్యక్తులకు అధికారిక ఆర్థిక సేవలు మరింతగా అందుబాటులోకి వస్తున్నాయి.

**అపూర్వ స్థాయిలో సమ్మిళితత్వం**

సాంకేతికత బ్యాంకింగ్‌ను మరింత సరళంగా మారుస్తోంది. డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లతో సౌకర్యంగా లేని ఖాతాదార్లకు సహాయం చేయడానికి వాయిస్ ఇంటర్‌ఫేస్‌లు, భారతీయ భాషల్లో సేవలు, అసిస్టెడ్ బ్యాంకింగ్, సులభమైన అప్లికేషన్లు, కృత్రిమమేధ(ఏఐ) ఆధారిత కస్టమర్ సపోర్ట్‌పై కృషి చేస్తున్నాం. బ్యాంకింగ్ సేవలను మరింతగా వ్యక్తిగతీకరించే సామర్థ్యం ఏఐకి ఉంది. సాంకేతికత ద్వారా ఖర్చు తగ్గించుకుని, మరింత మందికి బ్యాంకులు సేవలు అందించగలవు. ఖాతాదారు ఆర్థిక స్థితిని అర్థం చేసుకుని, అవసరమైన సూచనలు అందించే ప్రపంచం వైపు మనం అడుగులు వేస్తున్నాం. జన్‌ధన్ మొదటి పన్నెండేళ్లలో ఆర్థిక సమ్మిళితత్వాన్ని అపూర్వ స్థాయిలో సాధించవచ్చని రుజువైంది. మరింత ఆర్థిక స్థిరత్వం, బలమైన వ్యాపారాలు, మహిళలకు మరిన్ని అవకాశాలు, బాధ్యతాయుత రుణాలకు మెరుగైన ప్రాధాన్యం ఇవ్వడం భవిష్యత్తులో సాకారమవుతాయి. మనదేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నందున ఆర్థిక సమ్మిళితత్వం ఒక లక్ష్యంగా మాత్రమే కాకుండా, విస్తృత ఆర్థిక భాగస్వామ్యానికి ముఖ్యమైన పునాదిగా మారుతుంది.




# దేశం కోసం సర్వస్వాన్ని ధారపోసిన చింతలచెరువు హంపమ్మ

**- మరచిపోతున్న మహాత్యాగానికి చరిత్రలో శాశ్వత స్థానం కల్పిద్దాం**





డా. ముచ్చుకోట సురేష్ బాబు

**భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఎందరో మహనీయుల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయాయి. అయితే, దేశ స్వాతంత్ర్యం కోసం తమ సంపదను, ఆభరణాలను, వ్యక్తిగత సుఖసౌకర్యాలను త్యాగం చేసిన అనేక మంది సామాన్య ప్రజల చరిత్ర మాత్రం కాలగర్భంలో కలిసిపోతున్నది. అలాంటి అరుదైన దేశభక్తులలో రాయలసీమ నేల గర్వించదగ్గ మహాత్యాగి చింతలచెరువు హంపమ్మ ఒకరు. మహాత్మా గాంధీజీ చేపట్టిన హరిజనోద్యమ యాత్ర సందర్భంగా రాయలసీమ ప్రాంతానికి రావడం అనంతపురం జిల్లా చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. 1933 డిసెంబర్‌లో ప్రారంభమైన హరిజన యాత్రలో భాగంగా మహాత్మా గాంధీ ఆంధ్ర ప్రాంతంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఆ యాత్రలో భాగంగానే 1934 జనవరి 3న గాంధీజీ తన సహచరులతో కలిసి గుత్తి తాలూకా పరిధిలోని పెద్దవడుగూరు ప్రాంతానికి చేరుకున్నారు.మద్రాస్ మెరీనా బీచ్‌లో హరిజన యాత్ర సందర్భంగా జరిగిన సమావేశంలో గుత్తి ప్రాంతానికి చెందిన ప్రముఖులు పాల్గొని గాంధీజీ ఆలోచనలను, సందేశాన్ని ప్రత్యక్షంగా విన్నారు. స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రజల సహకారం, ఆర్థిక వనరులు అత్యంత అవసరమని గాంధీజీ స్పష్టం చేశారు. స్థానిక ప్రముఖుడు కుమ్మెత్త చిన్నరపరెడ్డి ఆహ్వానం మేరకు గాంధీజీ పెద్దవడుగూరుకు విచ్చేశారు. గుత్తి రైల్వే స్టేషన్ నుండి ఆయనను స్వయంగా కారులో తీసుకువచ్చి, పెద్దవడుగూరులో బసకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గాంధీజీ అక్కడ నాలుగు రోజుల పాటు బస చేసినట్లు స్థానిక చారిత్రక కథనాలు చెబుతున్నాయి.ఆ రోజులలో ఆయన ఉరవకొండ, కదిరి, ధర్మవరం వంటి ప్రాంతాలను సందర్శించి, తిరిగి రాత్రివేళ పెద్దవడుగూరుకు చేరుకునేవారు. ఎక్కడికి వెళ్లినా స్వాతంత్ర్యోద్యమం, సామాజిక సమానత్వం, అంటరానితనం నిర్మూలనతో పాటు దేశ సేవకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చేవారు.**

**గాంధీజీ కోసం తరలివచ్చిన వేలాది ప్రజలు**

గాంధీజీ పెద్దవడుగూరుకు వస్తున్నారనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు చేరడంతో ప్రజల్లో అపారమైన ఉత్సాహం నెలకొంది. మహాత్ముడిని ఒక్కసారి చూడాలనే ఆశతో తెల్లవారుజామునే ప్రజలు సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. సుమారు 12 వేల మంది ప్రజలు సభకు హాజరైనట్లు చెబుతారు. అంతటి భారీ జనసమూహాన్ని దృష్టిలో ఉంచుకొని ఎనిమిది అడుగుల ఎత్తులో ప్రత్యేక వేదికను నిర్మించారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సేవాదళ్ నాయకుడు కె. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది సేవాదళ్ సభ్యులు ప్రజలు శాంతియుతంగా ఉండేలా సేవలందించారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో మహాత్మా గాంధీజీ సభా వేదికకు చేరుకున్నారు. చిన్నరపరెడ్డి ఖద్దరు పూలమాలతో గాంధీజీకి ఘనస్వాగతం పలికి వేదిక పైకి ఆహ్వానించారు. అనంతరం కమ్మర సాంబయ్య ప్రార్థనతో సభ ప్రారంభమైంది.గాంధీజీ తన ప్రసంగంలో అంటరానితనం నిర్మూలన, సామాజిక సమానత్వం, జాతీయ ఐక్యత, స్వాతంత్ర్యోద్యమ ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. ఆయన హిందీలో చేసిన ప్రసంగాన్ని శ్రీ సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు.దేశ స్వాతంత్ర్యం కేవలం కొందరు నాయకుల పోరాటంతో సాధ్యం కాదని, ప్రతి భారతీయుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని గాంధీజీ పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగం చేయడమే నిజమైన దేశభక్తికి నిదర్శనమని ఆయన ప్రజలకు సందేశమిచ్చారు.

**హంపమ్మ త్యాగం... సభను కదిలించిన మహాక్షణం**

అప్పుడే ఆ సభలో ఒక అపూర్వమైన ఘట్టం చోటు చేసుకుంది.పెద్దవడుగూరు సమీపంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన దేశభక్తురాలు హంపమ్మ తన ఇంటి నుంచి రూ.1,116 తొలి విరాళంగా తీసుకొచ్చి గాంధీజీకి అందజేశారు. ఆమె దేశభక్తి, త్యాగస్ఫూర్తిని చూసిన గాంధీజీ ఆమెకు నమస్కరించి తన ప్రసంగాన్ని కొనసాగించినట్లు స్థానిక చరిత్ర చెబుతోంది.కానీ హంపమ్మ త్యాగం అక్కడితో ఆగలేదు.సభ ముగిసిన అనంతరం ఆమె మరోసారి గాంధీజీ వద్దకు వెళ్లింది. తన వద్ద ఉన్న నగదుతో పాటు తన బంగారు ఆభరణాలను కూడా దేశ సేవ కోసం సమర్పించింది. చివరికి తన మంగళసూత్రాన్ని కూడా విరాళంగా ఇవ్వడానికి వెనుకాడలేదు. ఆమె చేసిన ఆ మహాత్యాగం సభలో ఉన్న వేలాది మందిని కదిలించింది.హంపమ్మను చూసి పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలు తమ వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలను దేశం కోసం విరాళంగా అందించడం ప్రారంభించారు. ఒక్క మహిళ చేసిన త్యాగం వేలాది మందిలో దేశభక్తి జ్వాలను రగిలించింది.సభా వేదిక నుండి బయలుదేరే సమయంలో గాంధీజీ స్వయంగా హంపమ్మను అభినందించినట్లు చెబుతారు. ఆమె చూపిన త్యాగస్ఫూర్తి ఆ సభకు ప్రేరణగా నిలిచింది.ఆ సందర్భంగా సుమారు రూ.27 వేల నగదు మరియు 5.5 కిలోల బంగారం విరాళాల రూపంలో సమకూరినట్లు చారిత్రక వివరాలు తెలియజేస్తున్నాయి. ఇది ఆ కాలంలో ఎంతటి భారీ మొత్తం అనేది నేటి తరానికి ఊహించడం కూడా కష్టం.


**మన చరిత్రను మనమే మరచిపోతున్నామా?**

చింతలచెరువు హంపమ్మ పేరు నేడు ప్రధాన చరిత్ర పుస్తకాలలో పెద్దగా కనిపించకపోవచ్చు. కానీ ఆమె చేసిన త్యాగం మాత్రం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం కావాలి.విచారకరమైన విషయం ఏమిటంటే, మన ప్రాంతానికి, మన సంస్కృతికి సంబంధం లేని అనేక విషయాలను గొప్పగా చెప్పుకుంటూ, మన కళ్ల ముందే జరిగిన చారిత్రక ఘట్టాలను, మన స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్ని ధారపోసిన స్థానిక మహనీయులను మాత్రం మనమే విస్మరిస్తున్నాం.చింతలచెరువు హంపమ్మ వంటి త్యాగధనుల గురించి భావితరాలకు తెలియజేయడం మన సామాజిక బాధ్యత.ఆమె త్యాగం వృథా కాకూడదు. ఆమె పేరు కేవలం ఒక గ్రామ జ్ఞాపకంగా మిగిలిపోకూడదు.

**హంపమ్మకు సముచిత గుర్తింపు ఇవ్వాలి**

ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలు హంపమ్మ త్యాగానికి తగిన గుర్తింపు ఇవ్వాలి.గుత్తి-పెద్దవడుగూరు ప్రాంతంలోని ఒక ప్రధాన కూడలికి, రహదారికి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లేదా మహిళా కళాశాలకు "చింతలచెరువు హంపమ్మ" పేరు పెట్టాలి.అదేవిధంగా, గాంధీజీ పెద్దవడుగూరులో నిర్వహించిన చారిత్రక సభను, హంపమ్మ చేసిన మహాత్యాగాన్ని స్మరించుకునేలా ఒక స్మారక శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలి. స్థానిక పాఠశాలల్లో, కళాశాలల్లో ఆమె త్యాగగాథను విద్యార్థులకు తెలియజేయాలి.చరిత్ర అంటే కేవలం రాజులు, మహారాజులు, ప్రముఖ నాయకుల జీవిత చరిత్ర మాత్రమే కాదు. దేశం కోసం తన సర్వస్వాన్ని అర్పించిన హంపమ్మలాంటి సామాన్య మహిళల త్యాగమే నిజమైన ప్రజా చరిత్ర.దేశ స్వాతంత్ర్యం కోసం తన మంగళసూత్రంతో సహా సర్వస్వాన్ని సమర్పించిన చింతలచెరువు హంపమ్మకు చరిత్రలో శాశ్వత స్థానం కల్పించడం మనందరి బాధ్యత.ఆమె పేరు ఒక కూడలిపై మాత్రమే కాదు——మన ప్రాంత చరిత్రలో, మన పిల్లల పాఠ్యాంశాల్లో, మన సమాజపు సామూహిక స్మృతిలో చిరస్థాయిగా నిలవాలి. చింతలచెరువు హంపమ్మను స్మరించుకోవడం అంటే కేవలం ఒక మహిళను గౌరవించడం కాదు... దేశం కోసం త్యాగం చేసిన ఒక యుగాన్ని గౌరవించడం.

# ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?



**ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా, జాతీయ ఆహార భద్రతా చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2026 జూన్‌లో ముసా యిదా సవరణ బిల్లును విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సవరణలు మంచివా కావా అనే విషయాన్ని పక్కన పెడితే, ఈ చర్చలో తరచూ వినిపిస్తున్న ప్రశ్న ఒకటుంది: 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్నవేళ, దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం ఇంకా అవసరమా?'ఈ ప్రశ్నకు ప్రధానంగా రెండు రకాల స్పందనలు వినిపిస్తాయి: ఇంత భారీ స్థాయిలో ఉచిత రేషన్ ఇవ్వడం ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించకుండా సంక్షేమంపై ఆధారపడేలా చేస్తోందనేది ఒక వాదన. మరోవైపు, దేశం నిజంగా అంతగా అభివృద్ధి చెందితే ఇన్ని కోట్ల మందికి ఉచిత ఆహారం ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నిస్తూ, ఆర్థికవృద్ధి కథనాన్నే అనుమానించేది మరో వాదన. కానీ ఈ రెండు వాదనలూ ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నాయి: తీవ్రమైన పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక భద్రత సాధించడం ఒకటే కాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ, పేదరికం తగ్గుతున్నప్పటికీ సంక్షేమం అవసరం తప్పనిసరిగా తగ్గిపోదు.**

గత రెండు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరిగిందన్నది వాస్తవం. అదే సమయంలో పేదరికం కూడా భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు 2025 జూన్‌లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, రోజుకు 3 డాలర్ల పేదరిక రేఖను ప్రమాణంగా తీసుకుంటే, 2011-12లో 27.1శాతంగా ఉన్న 'తీవ్రమైన పేదరికం' 2022-23 నాటికి 5.3శాతానికి తగ్గింది. కానీ కథ అక్కడితో పూర్తికాదు. పేదరికం తగ్గడం వేరు, ఆర్థిక భద్రత వేరు.

పేదరికాన్ని కొలిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఒకే ప్రమాణాన్ని ప్రపంచ బ్యాంకు ఉపయోగించదు. దిగువ-మధ్య ఆదాయ దేశాలకు పేదరిక ప్రమాణంగా నిర్ణయించిన 'రోజుకు 4.20డాలర్ల' లెక్కనే తీసుకుంటే, 2022-23లో భారత జనాభాలో 23.9శాతం మంది ఆ రేఖకు దిగువన ఉన్నారు. ఎగువ-మధ్య ఆదాయ దేశాలకు ఉపయోగించే 8.30 డాలర్ల ప్రమాణాన్ని తీసుకుంటే ఈ సంఖ్య ఏకంగా 82.1శాతానికి చేరుతుంది.

పేదరికానికి సంబంధించి 5.3శాతం, 23.9శాతం, 82.1శాతం అనే మూడు సంఖ్యలు ఒక కీలక వాస్తవాన్ని బయటపెడతాయి: ఏ ప్రమాణంతో కొలుస్తామన్నదాన్ని బట్టి 'పేద' అనే నిర్వచనం, ఆ పరిధిలోకి వచ్చే జనాభా - రెండూ పూర్తిగా మారిపోతాయి. తీవ్ర పేదరిక రేఖను దాటినంత మాత్రాన కోట్లాది మంది ఆర్థిక అభద్రత నుంచి బయటపడినట్లు కాదు.

ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త, భారతీయ వ్యవహారాలపై నిపుణుడు ప్రొఫెసర్ డియెగో మయోరానో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తారు. తీవ్ర పేదరికం నుంచి బయటపడినప్పటికీ, భారత జనాభాలో పెద్ద భాగం పేదరికానికి కొద్దిగా ఎగువన మాత్రమే జీవిస్తోందని; అనారోగ్యం, పంట నష్టం లేదా ఆదాయంలో అకస్మాత్తుగా వచ్చే దెబ్బలు వారిని మళ్లీ పేదరికంలోకి నెట్టగలవని ఆయన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. ఒక కుటుంబం అధికారికంగా దారిద్ర్య రేఖకు పైన ఉండవచ్చు. ఇంట్లో మోటార్ సైకిల్, స్మార్ట్ ఫోన్ ఉండవచ్చు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతుండవచ్చు. బయటకు చూస్తే అది మధ్యతరగతి కుటుంబంలా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబంలో తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగం పోవటం లేదా పంట నష్టం సంభవిస్తే? ఒక్క సంఘటనే చిన్న పొదుపును తుడిచిపెట్టి, అప్పుల్లోకి నెట్టి, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకునేలా చేసి, ఆ కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి తోసేయవచ్చు. అందుకే పేదరికం తగ్గడం వేరు; ఆర్థిక భద్రత సాధించడం వేరు.

ఈ ఆర్థిక అస్థిరత ఎంతమాత్రం ఊహాజనితం కాదు. 'ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' డేటాను ప్రపంచ బ్యాంకు విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టమైంది- 2005 నుంచి 2012 మధ్య 27శాతం కుటుంబాలు పేదరికం నుంచి బయటపడగా, 7శాతం కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోయాయి. ఈ కోణంలోనే 80 కోట్ల ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్యను కూడా చూడాలి. నిజానికి ఇది ప్రస్తుత పేదరికానికి సంబంధించిన ప్రత్యక్ష అంచనా కాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ జనాభాలో 50శాతం వరకు కవరేజ్ కల్పించాలన్న నిబంధనను బట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 81కోట్లుగా ఉంది. కాబట్టి వీరందరినీ అత్యంత పేదలుగా చూడటం కంటే, వారిలో ఎంతమంది ఆహార భద్రత వంటి రక్షణలు లేకుండా ఒక అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా ఆదాయపు దెబ్బను తట్టుకోగలరన్నదే అడగాల్సిన అసలు ప్రశ్న.

ఇన్ని సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ ఈ అభద్రత ఇంకా ఉంటే సంక్షేమం విఫలమైందనుకోవాలా? అలా తేల్చడం తొందరపాటు. సంక్షేమం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా భద్రమైన స్థితికి తీసుకెళ్లే ఏకైక సాధనం కాదు. ఆహార భద్రత, ఉపాధి హామీ, పింఛన్లు వంటి పథకాలు ఆర్థిక దెబ్బ వచ్చినప్పుడు కుటుంబం పూర్తిగా కిందపడిపోకుండా కనీస రక్షణను కల్పిస్తాయి. మనం గమనించాల్సింది - ఇవి లేకపోతే ఆ కుటుంబాలు ఎంత త్వరగా అప్పుల్లోకి, ఆకలిలోకి జారిపోతాయన్నది. అందువల్ల ఒక సంక్షేమ పథకం విజయాన్ని 'లబ్ధిదారుడు ఇంకా ఆర్థిక అభద్రతలోనే ఉన్నాడా?' అనే ఒక్క ప్రశ్నతో కొలవలేం. 'ఆ పథకం లేకపోతే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేది?' అన్న ప్రశ్న కూడా అడగాలి.

దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో వైద్యం, విద్య వంటి అంశాలు అవసరమే. సంక్షేమం వాటికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆ స్థాయి భద్రత అందరికీ అందేంతవరకు, సామాజిక రక్షణ ఒక కీలకమైన ఆధారంగా ఉంటుంది.

మరి సంక్షేమంపై మనం నిజంగానే అధికంగా ఖర్చు చేస్తున్నామా? సంక్షేమ పథకాల పరిధి విస్తృతంగా ఉండటం వల్ల, దేశ సంపదలో అసాధారణంగా పెద్ద భాగాన్ని వాటికే ఖర్చు చేస్తున్నామనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్థికవేత్త రీతికా ఖేరా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది ప్రధాన సంక్షేమ పథకాలపై గత రెండు దశాబ్దాల వ్యయాన్ని పరిశీలించారు. వారి లెక్కల ప్రకారం, ఒక్క కోవిడ్ సంవత్సరంలో మాత్రమే ఈ పథకాల మొత్తం వ్యయం జీడీపీలో 3శాతాన్ని దాటింది. 2023-24లో జీడీపీలో వీటి వాటా దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి పెద్దగా భిన్నంగా లేదు. ఈ పరిశీలన కొన్ని ప్రధాన పథకాలకే పరిమితమైనప్పటికీ ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: విస్తృత కవరేజ్ ఉన్నంత మాత్రాన మనం నిజంగా అధికంగా ఖర్చు చేస్తున్నట్లా?

కోట్ల మందికి ఒక పథకం చేరుతున్నప్పటికీ, ఒక్కో కుటుంబానికి అందుతున్న సహాయం వారి వాస్తవ అవసరాలతో పోలిస్తే పరిమితంగానే ఉండవచ్చు. అందువల్ల కేవలం లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సంక్షేమ వ్యయం తీవ్రభారంగా మారిందని తేల్చడం సరికాదు. దేశ ఆర్థిక సామర్థ్యంతో పోలిస్తే ఎంత ఖర్చు చేస్తున్నాం, ఆ ఖర్చు కుటుంబాలకు ఎంతవరకు ఆర్థిక రక్షణ కల్పిస్తోంది అన్నవే అసలైన ప్రశ్నలు.

చిన్న ఆర్థిక దెబ్బలకే కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారే ప్రమాదం ఉన్నప్పుడు సంక్షేమాన్ని తగ్గించడం సరికాదు. కేవలం రేషన్ పంపిణీకే పరిమితం కాకుండా నాణ్యమైన ఉచిత వైద్యం, విస్తృత సామాజిక భద్రత వంటి వ్యవస్థలను అందించాలి. లబ్ధిదారుల సంఖ్య కంటే రక్షణ నాణ్యతను పెంచడమే ముఖ్యం. అందుకే సంక్షేమంపై చర్చ కేవలం సంఖ్యల చుట్టూ మాత్రమే తిరగకూడదు. ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ, పెరుగుతున్న ఆ సంపదలో కొంత భాగాన్ని పౌరుల ఆర్థిక భద్రత కోసం కేటాయించడం సహజమైన తదుపరి అడుగు కావాలి.

బహుశా అసలు ప్రశ్న 'ఇంకా సంక్షేమం ఎందుకు?' అన్నది కాదు. ఆర్థికంగా బలపడుతున్న భారత్, పెరుగుతున్న సంపదను తన పౌరుల ఆర్థిక భద్రతగా ఎంతవరకు మార్చగలుగుతోంది అన్నదే అసలు ప్రశ్న.

# మంచి చేసే కూటమిని ఆదరించాలి..

- ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమికొట్టాలి
- ఎల్నినో సమయం లో పుష్కర, పట్టిసీమ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయి
- గోదావరి ఎడమ కాలువ ప్రారంభ సభలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**అనకాపల్లి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**



గోదావరి జలాలు నేడు ఉత్తరాంధ్రను తాకుతున్నాయంటే అపర భగీరథుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికతే అని నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్ర నీటి వనరుల శాఖకు సంబంధించి.. పోలవరం ఎడమ కాలువ ప్రారంభం ఒక సువర్ణాధ్యాయంగా మంత్రి రామానాయుడు అభివర్ణించారు. 2014లో గౌర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకొస్తానని ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారన్నారు.

పోలవరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే గోదావరి జలాలను అటు కృష్ణా డెల్టాకు, ఇటు ఉత్తరాంధ్రకు తీసుకువస్తానని.. మాట ఇచ్చి నిలబెట్టుకున్న మహనీయుడు చంద్రబాబు నాయుడు అని ఆయన పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా దాహార్తిని తీర్చారు. పుష్కర ద్వారా ఉత్తరాంధ్రకు గోదారమ్మని తీసుకొచ్చారు.. ఇది ఆయన ముందుచూపుకు, దార్శనికతకు నిదర్శనం అన్నారు. ఇదే తరుణంలో గొడ్డలి పార్టీ అధినేత నాడు ప్రతిపక్ష హోదాలో.. పట్టిసీమ వట్టిసీమని, పుష్కర పనికిరానిదని ఎద్దేవా చేశారు. అంతటితో ఆగకుండా తాను అధికారంలోకి వస్తే ఈ రెండిటినీ పీకేస్తానని అన్నారు. సూపర్ ఎల్ నినో ఉపద్రవ సమయంలో ఈ రెండు పథకాలు.. ఎంతగా ఉపకరించాయో మీ అందరూ తెలుసుకోవాలన్నారు.

ఐదు ప్రధాన నదులను, 9 చోట్ల జాతీయ రహదారులను, కుమ్మరి లోవ తదితర ప్రాంతాలలో 100 మీటర్ల లోతున తవ్వకాలు జరిపి కాలువ ముందుకు తీసుకురావడం వంటి ఎన్నో క్లిష్టమైన పనులను చేయడం వెనుక ఎంతో శ్రమ ఉందని రామానాయుడు చెప్పారు.

ఇదే తరుణంలో.. ఐదేళ్ల అధికారంలో ఉన్న గొడ్డలి పార్టీ ఎడమ కాలువకు సంబంధించి తట్ట మట్టి తీయలేదు.. బస్తా సిమెంట్ వెయ్యలేదు.. ఇలాంటి ముంచేసే గొడ్డలి పార్టీ అవసరమా.. మీకోసం అహర్నిశలు కష్టపడుతూ.. మీ భవిష్యత్తు తరాలకు.. బంగారు బాటలు వేసే మంచి చేసే కూటమి అవసరమా ఆలోచించాలి అని రామానాయుడు.. పిలుపునిచ్చారు.

సూపర్ ఎల్ నినో.. వర్షాభావ పరిస్థితుల్లో కూడా.. 900 టిఎంసిల గోదావరి వరద నీరు బంగాళాఖాతంలో కలిసిపోయిందని రామానాయుడు ఆవేదన చెందారు. గొడ్డలి పార్టీ హయాంలో పోలవరం విధ్వంసం కాకుండా ఉండుంటే.. కుడికాలువకు 17,500 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 17500 క్యూసెక్కులు వెరసి 350 టీఎంసీల నీటితో సమృద్ధిగా మన పంటలు పండేవన్నారు. ఐదేళ్ల అమూల్య సమయం.. వృధా చేయడమే కాకుండా.. ఉత్తరాంధ్రకు.. గొడ్డలి పార్టీ తీవ్ర ద్రోహం చేసిందని రామానాయుడు విమర్శించారు.. అటువంటి గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## అనంతగిరిలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

**`అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు తడబారికి మిత్తుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి తడబారికి మిత్తుల, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిత్తుల మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. పేదలు, రైతులు, విద్యార్థుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శెట్టి నీలవేణి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దూరు గంగన్నదొర, మండల పరిశీలకుడు ఎస్. సన్యాసిరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగ బోయిన స్వామి, పాంగి అప్పారావు, పాడి కృష్ణమూర్తి, డానియల్, బాడంu నాగేశ్వరరావు, ఎస్. నవీన్, బోర్రా ఎస్. లక్ష్మణరావు, సీనియర్ నాయకులు గుజ్జల మధుసూదన్, కే. సింహాద్రి, మాజీ సర్పంచులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## భారీ లారీలతో వేంగడ రోడ్డు గోతులమయం.. చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వేంగడ పంచాయతీ పరిధిలో వేంగడ నుంచి జంబువలస వరకు ఉన్న సుమారు 4 కిలోమీటర్ల తారు రోడ్డు గోతులమయంగా మారింది. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులకు అవసరమైన నిర్మాణ సామగ్రిని భారీ లారీల ద్వారా ఈ రోడ్డుపై తరలిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు తెలిపారు.భారీ వాహనాల రాకపోకలతో పలుచోట్ల తారు రోడ్డు బద్దలై గోతులు ఏర్పడ్డాయని వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు తెలిపారు. రోడ్డు పరిస్థితిని అనంతగిరి పంచాయతీరాజ్ జేఈ గణేష్ దృష్టికి తీసుకెళ్లామని, రెండు యూనిట్ల లారీలను మాత్రమే నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా భారీ లారీల రాకపోకలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఇలాగే కొనసాగితే రోడ్డు పూర్తిగా దెబ్బతిని అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగలేదని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి భారీ లారీల రాకపోకలను నియంత్రించాలని, ఇప్పటికే ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేపట్టి రోడ్డును పరిరక్షించాలని కొండలరావు కోరారు.

## ఎస్కేయూలో ముగ్గుల పోటీలకు స్పందన



**అనంతపురం సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రాంగణం లో సెప్టెంబర్ 4వ తేదీన జరుగు శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద విద్యార్థినిల తో ముగ్గుల పోటీలు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రమణ యాదవ్ హైకోర్టు న్యాయవాది.పోతుల రాధాకృష్ణ యాదవ్, బి. సి. ఉద్యమాల నాయకులు, ఉపాధ్యాయులు. యూనివర్సిటీ బి. సి.ఉద్యోగ సంఘం అధ్యక్షులు మల్కారి ఆలూరు లక్ష్మణ రావు,జైపాల్ యాదవ్ బి. సి.విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఇతర శ్రీకృష్ణ జయంతి కమిటీ సభ్యులు పాల్గొని అమ్మాయిలు వేసిన ముగ్గులలో ఉత్తమ ముగ్గులు వేసిన వారికి బహుమతులను 4వ తేదీన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి , స్థానిక శాసన సభ్యులు పరిటాల సునీత చేతుల మీద అందించడం జరుగును అని కమిటీ చైర్మన్ జైపాల్ యాదవ్ తెలిపారు

## పంచాయతీలను సందర్శించిన స్వర్ణ వార్డు అధికారి

**యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో ఉన్న పంచాయతీ కార్యాలయం ను, యాడికి లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం జిల్లా స్వర్ణ గ్రామం , స్వర్ణ వార్డు అధికారి నర్సా రెడ్డి, మండల స్వర్ణ గ్రామ అధికారి కాంతమ్మ లు సందర్శించారు. ఈ సందర్భంగా రాయలచెరువు లో పంచాయతీ కార్యాలయం లో స్వర్ణ గ్రామ సిబ్బంది తో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వర్ణ గ్రామం , స్వర్ణ వార్డు అధికారి నర్సా రెడ్డి, మండల స్వర్ణ గ్రామ అధికారి కాంతమ్మ లు మాట్లాడుతూ ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని , ఎటువంటి అనధికార వసూలు చేయకూడదని సిబ్బంది తెలిపారు. అందరూ కార్యాలయాల ఇన్ టైం అవుట్ టైం పాటించాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్, ఈఓ ప్రమీల, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.




## 'జై కొట్టు' వీడియో వైరల్!

**అమరావతి, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యక్రమాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జనసేన పార్టీ యువజన విభాగానికి 'జై కొట్టు' అనే పేరు పెట్టి.. లోగోను ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆహార అండ్ పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ 'జై కొట్టు' లోగోతో పాటు గేయాన్ని కూడా ఆవిష్కరించారు. యువజన విభాగం ఆవిష్కరణ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. పార్టీ యువజన విభాగం ద్వారా యువతను మరింతగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, వారికి బాధ్యతలు అప్పగించడం లక్ష్యంగా ఈ కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జనసేన యువజన విభాగం నేపథ్య గీతంకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ మ్యూజిక్ అందించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత రెండు, మూడు నెలలుగా పవన్ కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారన్నారు. అయినప్పటికీ పవన్ ఎక్కడ ఉన్నా ప్రజల గురించి ఆలోచిస్తూనే ఉంటారన్నారు. పార్టీకి, రాష్ట్ర ప్రజలకు తన వంతు సేవ అందించాలనే ఆలోచనతో పవన్ ఎప్పుడూ ముందుంటారని మంత్రి నాదెండ్ల అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావించిన నాదెండ్ల.. అప్పటి ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు జనసేన పార్టీ కూటమితో కలిసి కీలకంగా పనిచేసిందని చెప్పారు.

## రేవంత్‌పై కొండా సురేఖ తిరుగుబాటు గళం

(మొదటి పేజీ తరువాయి)

తనపై చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారని మంత్రి కొండా సురేఖ అన్నారు. వేణుగోపాల్ అపాయింట్మెంట్ దొరకలేదన్నారు. తన బిడ్డ మాట్లాడితే తనకు ఎందుకు శిక్ష వేస్తారని ప్రశ్నించారు. మహిళలు స్వతంత్రంగా బతకాలని రాహుల్ చెప్పుతున్నారని, నా కూతురు మాట్లాడిన దానికి నాపై చర్యలు తీసుకోవద్దని కోరారు. 'మల్లికార్జున ఖర్గేను కలిశాను. నేను నా వివరణ ఖర్గేకు ఇచ్చాను. నాపై చర్యలు తీసుకో కంటే ముందు సీఎంపై చర్యలు తీసుకోవాలి. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా అంటారు. పొంగులేటి, బట్టి భార్య కమిషన్ల పైన కూడా చాలా ఫిర్యాదులు వచ్చాయి. దానిపైన ఎందుకు మాట్లాడటం లేదు. చాలామంది రెడ్లు మాట్లాడితే వారిపైన ఎందుకు చర్యలు తీసుకోలేదు.' అని కొండా సురేఖ అన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలసి నట్లు సురేఖ తెలిపారు. 'పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా చర్చలు జరగలేదు. ఇప్పటివరకు అధిష్ఠానం నన్ను రాజీనామా చేయమని చెప్పలేదు.' అని ఆమె వెల్లడించారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, పొలిటికల్ సమీకరణాలపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు పార్టీ ముఖ్య నాయకులందరికీ రాతపూర్వకంగా లేఖలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ రోజు ఖర్గేను కలిసిన సమయంలో కూడా ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని స్వయంగా కోరినట్లు ఆమె వివరించారు. పార్టీలో సామాజిక న్యాయం అమలు తీరుపై కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బహుజన సామాజిక వర్గానికి చెందిన తనకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాల నాయకులకు మరొక న్యాయం పాటిస్తారా? అని ఆమె ప్రశ్నించారు. 'రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న ఇతర వర్గాల నాయకత్వంపై అనేక తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. మరి వాటన్నింటిపై అధిష్ఠానం ఏం సమాధానం చెబుతుంది? వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' అంటూ సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న కొండా సురేఖ నేరుగా అధిష్ఠానం పెద్దల వద్దే కేబినెట్ పరిణామాలను ప్రస్తావించడం, సామాజిక న్యాయం కోణంలో ప్రశ్నలు గుప్పించడం తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

## ఘనంగా దిగవంత నేత,డాక్టర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి



**అమడగూరు,సెప్టెంబర్, 2 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండల కేంద్రంలోని బస్టాండ్ నందు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ తనకంటి జయప్ప ఆధ్వర్యంలో డాక్టర్.వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి 17వ వర్ధంతి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్.జయప్ప మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరపురాని మహానేత,దేశ రాజకీయాలను మార్చిన,అపర భగీరథుడు, రైతు బాంధవుడు,ఆరోగ్యశ్రీ ప్రధాత,విద్యా ప్రదాత,హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును,ఆంధ్రప్రదేశ్ జల నాడి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించి,ప్రజహితనికి అంకితభావంతో తన ప్రాణాలను అర్పించి,ఆంధ్ర ప్రదేశ్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయిందని,ఆయన ఆశీస్సులు మనపై ఉండాలని ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.ఈ కార్యక్రమంలో , మాజీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషురెడ్డి, మాజీ సర్పంచ్ సురేంద్ర రెడ్డి శ్రీధర్ రెడ్డి, రంగారెడ్డి,ఆదినారాయణ,ఎంపిటిసి లు సురేంద్ర రెడ్డి, నాగరాజు,నారాయణ,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నక్కల.చిన్నప్ప, మహమ్మదబాద్ సొసైటీ మాజీ చైర్మెన్ బొట్టు. స్వామి.ఆంజనేయులు,, టౌన్ కన్వీనర్ సుధాకర్ ఎస్ బాబు సోహెల్ కేశవ వెంకటరెడ్డి, యస్.పాల్,నారాయణ స్వామి,మురళి,నవీన్ ఖాజాపూర్ వెంకట శివ గడ్డం నరసింహులు ఆది రెడ్డప్ప,మొబైల్ సూరి, మణికంఠ రాజు నరేష్,శివ,పక్కిర్ రెడ్డి,దామోదర్ రెడ్డి,సీనియర్ నాయకులు, వైఎస్ఆర్సిపి.కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకలు



**నల్లచెరువు సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు బస్టాండ్ లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు, పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండల జన సేన పార్టీ యువ నాయకుడు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి బానసంసాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని జన సేన పార్టీ నాయకులు మండల నాయకులు జన సైనికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## గిరి గ్రామంలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ పాలన
- అనంతగిరి జనసేన నేత గుజ్జెల మంగళ

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, సెప్టెంబర్ 2:**

అనంతగిరి మండలంలోని కొండిబ పంచాయతీ గిరి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి అనంతగిరి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జెల మంగళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గుజ్జెల మంగళ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు జయ కుమార్, సింహాద్రి, జ్యోతి, కియావతి, బాబురావు, దీపరాజు, బాబూజీ, శివ కార్తిక్, ధనవతి, శివ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యతో మూలియగూడ గ్రామం

- ఆరు నెలలుగా పనిచేయని సోలార్ మోటారు.. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



అనంతగిరి మండలంలోని టోకూరు పంచాయతీ పరిధిలోని మూలియగూడ గ్రామం తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. గ్రామంలోని కింది వీధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ మోటారు గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనంతగిరి జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుజ్జెల మంగళ తెలిపారు.సోలార్ మోటారు పనిచేయకపోవడంతో కనీసం తాగడానికి కూడా నీరు అందక గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శికి పూర్తిగా సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వేసవితో పాటు ప్రస్తుతం కూడా మంచినీటి సమస్య కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి పనిచేయని సోలార్ మోటారును మరమ్మతు చేసి, గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గుజ్జెల మంగళ డిమాండ్ చేశారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

గురువారం । రంగారెడ్డి
03.09.2026



# పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



- అక్రమ గుడుంబా తయారీ కేంద్రాల ధ్వంసం..
- పత్రాలు లేని వాహనాలు స్వాధీనం
- యువత పోలీస్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో దుమ్ముగూడెం, చర్ల పోలీస్ స్టేషన్ల సిబ్బంది సంయుక్తంగా దుమ్ముగూడెం మండలం సుజ్ఞానపురం గ్రామంలో బుధవారం తెల్లవారు జామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వివిధ ప్రాంతాల్లో గుర్తించిన అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. అలాగే సరైన, చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ గ్రామస్థులతో మాట్లాడి ఎన్‌డీపీఎస్ నేరాలు, అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలు, సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పదంగా లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గ్రామస్థులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు పోలీస్ ఉద్యోగ నియామక అవకాశాలపై అవగాహన కల్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణా కార్యక్రమాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ నియామక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ, చర్ల ఎస్‌హెచ్‌ఓ వెంకటప్పయ్య, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ, శ్యామ్ ప్రసాద్, జగన్మోహన్ చారి, ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**మణుగూరు, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 1న ఒడిశా రాష్ట్రంలోని కలిమెల నుంచి భద్రాచలం, మణుగూరు, ఏటూరునాగారం మీదుగా షిర్డీకి టాటా నెక్సాన్ కారులో భార్యాభర్తలు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. ఉన్నతాధికారుల అనుమతితో అశ్వాపురం ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి గొల్లగూడెం గ్రామ శివారులోని సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో OD 30 E 0342 నంబర్ గల టాటా నెక్సాన్ కారును ఆపి తనిఖీ చేయగా, కారు వెనుక డిక్కీలో అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల 560 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, అరబిందో బిశ్వాస్ (33), తండ్రి రతన్ బిశ్వాస్, కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కన్‌గిరి జిల్లా, ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, సుప్రియ బిశ్వాస్ (26), అరబిందో బిశ్వాస్ భార్యగా పోలీసులు గుర్తించారు.




విచారణలో వారు కలిమెలలోని సాలబాగ్ గ్రామానికి చెందిన హరిశ్చంద్ర మిస్త్రీ, సుశాంత్ మండల్ అనే ఇద్దరి వద్ద నుంచి గంజాయిని తీసుకుని, షిర్డీలోని రోహిత్ యాబిన్ అనే వ్యక్తికి సరఫరా చేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అశ్వాపురం ఎస్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు, సరఫరా నెట్‌వర్క్‌పై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దు
- యువత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, సోషల్ మీడియా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత సోషల్ మీడియా, ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టడం, నకిలీ పోలీస్ లేదా ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకోవడం, పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేయడం, నకిలీ యాప్‌లు, లింకుల ద్వారా డబ్బులు కాజేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు తదితర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ఫొటో మార్ఫింగ్, ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా సినిమాల్లో కనిపించే ప్రతి విషయాన్ని అనుకరించకుండా, మంచి విషయాలను మాత్రమే స్వీకరించి చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. స్నేహితుల ఒత్తిడి, సరదా లేదా ఇతర కారణాలతో డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి, వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులతో నేరుగా మమేకమై ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ సైబర్ నేరాలు, సోషల్ మీడియా, డ్రగ్స్, పోక్సో, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మరింత అవగాహన కల్పించారు.

సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమణారెడ్డి, జుబేదాబేగం, కళ్యాణి, రమాదేవి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ



- విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందంతో సమీక్ష
- మలేరియా, పోషకాహారం, నేత్రదానంపై అవగాహన కల్పించిన డిఎంహెచ్వో

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ బుధవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏటపాక మండలం గొన్సగుప్ప ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో జ్వర కేసులు నమోదైన నేపథ్యంలో 52 మంది విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. వీరిలో 9 మందికి మాత్రలు తీసుకున్న అనంతరం దుష్ప్రభావాలు, ఆందోళన లక్షణాలు కనిపించగా, జమున అనే విద్యార్థిని ఆసుపత్రికి తీసుకురాగానే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించిన డీఎంహెచ్‌ఓ, మలేరియా పాజిటివ్ కేసులకు రక్తపు స్మియర్ నమూనాలు సేకరించి నిబంధనల ప్రకారం క్రాస్ వెరిఫికేషన్‌కు పంపాలని ఆదేశించారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (గిరిజన) డాక్టర్ సైదులు, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్ యూనిట్ అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కప్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకున్న శ్రీ త్రివేణి హై స్కూల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

శ్రీ త్రివేణి హై స్కూల్*, చంపాపేట్ “ సీఎం కప్ 2026” టైటిల్ విజేతగా నిలిచింది. నటరాజ్ అకాడమీ 18వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్ర భారతి ప్రధాన వేదికపై నిర్వహించిన “సీఎం కప్ 2026 - ప్రజా పాలన, ప్రజా కళావైభవం, తెలంగాణ సాంస్కృతిక ఉత్సవం”లో విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.తెలంగాణలోని 20కి పైగా ప్రాంతాల నుంచి సుమారు 2,000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్న ఈ ఉత్సవంలో శ్రీ త్రివేణి హై స్కూల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, పల్లె జీవనం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలను విద్యార్థులు నృత్య రూపకాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పిల్లలకు విద్యతో పాటు కళలు, సంస్కృతి, సాహిత్యం, క్రీడల్లోనూ ప్రోత్సాహం అందించాలని, పిల్లల్లోని ప్రతిభను గుర్తించి సరైన వేదిక కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ లింగిడి మాట్లాడుతూ, రవీంద్ర భారతి వేదికపై నటరాజ్ అకాడమీ నిజమైన తెలంగాణ జాతర వాతావరణాన్ని సృష్టించిందని అభినందించారు

. నటరాజ్ అకాడమీ గత 18 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థుల్లో కళా ప్రతిభను వెలికితీస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు కొత్త తరాన్ని చేరువ చేస్తోందని డాక్టర్ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. సీఎం కప్ 2026లో గౌతమ్ హై స్కూల్ ప్రథమ బహుమతి, క్యాండర్ షైన్ స్కూల్, బ్రిలియంట్ స్కూల్ ద్వితీయ బహుమతి, సెయింట్ ఆడమ్స్, చిక్కడపల్లి తృతీయ బహుమతి సాధించాయి.



# సింగరేణి సొత్తును స్వాధీనం చేసుకున్న ఎస్ అండ్ పిసి

**మణుగూరు, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

మణుగూరు మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్‌లో కేబుల్ చోరీకి పాల్పడిన దొంగలపై సింగరేణి సెక్యూరిటీ విభాగం స్పెషల్ టీం, ఇంటెలిజెన్స్ టీం సంయుక్తంగా పట్టుకున్నారు. జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ నేతృత్వంలో చురుగ్గా వ్యవహరించిన సిబ్బంది చోరీకి గురైన కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి సుమారు 9.25 గంటల సమయంలో మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్ నుంచి సుమారు 50 మీటర్ల 35 ఎంఎం ఆర్మర్డ్ కేబుల్ చోరీకి గురైనట్లు నమ్మదగిన సమాచారంతో ఆ ప్రాంతానికి వెళ్లగా చోరీ చేసిన కేబుల్‌ను మల్లేపల్లి చెరువు కట్ట సమీపంలో దొంగలు ఒలుస్తుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. స్పెషల్ టీం రాకను గమనించిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే చోరీ చేసిన కేబుల్‌ను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ స్వయంగా కేబుల్‌ను తీసుకువచ్చి మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్‌లో భద్రపరిచారు.

అనంతరం దొంగతనానికి సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించి మణుగూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. చోరీ ఘటనపై వేగంగా స్పందించి, సమాచారం సేకరించి, దొంగలను గుర్తించి పోలీసులకు అప్పగించడంలో సెక్యూరిటీ డిపార్ట్మెంట్ స్పెషల్ టీం, ఇంటెలిజెన్స్ టీం కీలక పాత్ర పోషించాయి.



# గుండాల నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించాలి

- ఆర్టీసీ డీఎం సుభాషిణికి వినతి

**గుండాల, సెప్టెంబరు 2 (అనంత జనశక్తి):**

మారుమూల ఏజెన్సీ మండలమైన గుండాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నేరుగా ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించాలని నవచైతన్య యువజన సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఇల్లెందు ఆర్టీసీ డీఎం సుభాషిణికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఇల్లెందు నుంచి హైదరాబాద్‌కు ప్రస్తుతం నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఒకదాన్ని గుండాల-పస్రా మీదుగా హైదరాబాద్ వరకు నడపాలని వారు విజ్ఞప్తి చేశారు. గుండాల, పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోగులు నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.



గుండాల మీదుగా హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసు ప్రారంభిస్తే ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతోపాటు విద్య, వైద్యం, ఉపాధి అవసరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని గుండాల-పస్రా మీదుగా హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సర్వీసును వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

ఎం.అశోక్, ఎస్‌కే.ఆజాద్, ఎం.వినయ్, కే.సతీష్, ఎం.రంజిత్, యాకయ్య తదితరులు వినతి పత్రం అందజేశారు .

# సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి నిరీక్షణ!

- తహసీల్దార్ కార్యాలయంలో జాప్యంపై సీపీఎం ఆగ్రహం
- డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదంటూ ఆరోపణలు..
- తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్

**గుండాల, సెప్టెంబరు 2 (అనంత జనశక్తి)**

ప్రజా అవసరాల కోసం పనిచేసే తహసీల్దార్ కార్యాలయంలో వివిధ ధ్రువపత్రాల విషయంలో జారీకి నెలల తరబడి జాప్యం జరుగుతోందని సీపీఎం మండల కార్యదర్శి తొలెం గోపి ఆరోపించారు. రేషన్ కార్డు, కుల, ఆదాయ, ఫ్యామిలీ సర్టిఫికెట్లతో పాటు కల్యాణలక్ష్మి, భూ సమస్యలకు సంబంధించిన ధ్రువపత్రాల కోసం ప్రజలు, విద్యార్థులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బుధవారం గుండాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తొలెం గోపి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలు అత్యవసరంగా అవసరమైన ధ్రువపత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్టిఫికెట్ల జారీ విషయంలో కొందరు రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, డబ్బులు ఇవ్వనిదే పనులు చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగాలు, ఇతర అవసరాలకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కీలకమని పేర్కొన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తహసీల్దార్ తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధ్రువపత్రాల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈర్ప కన్నయ్య, తొలెం సాగర్, ఊకె వెంకటేశ్వర్లు, ఈసం సాయికుమార్, దుగ్గి రామ్మూర్తి, జోగా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల హృదయాల్లో రాజన్న..

**- గుండాలలో 17వ వర్ధంతి కార్యక్రమం..**
**- సంక్షేమ పథకాలతో చిరస్థాయిగా నిలిచిన మహానేతగా కొనియాడిన కాంగ్రెస్ నేతలు**

**గుండాల, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా గుండాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఖదీర్ పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొంబోయిన ముత్తయ్య, ఎస్.కె. ఖదీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వైఎస్సార్ అందించిన సేవలు ఎనలేనివని, ఆయన నాయకత్వంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి అనేక సహాయ సహకారాలు అందేవని గుర్తుచేశారు.

ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వైఎస్సార్ చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల వరకు వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఆయన కృషి చేశారని కొనియాడారు. వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడిచినా ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సజీవంగా ఉన్నారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కాంగ్రెస్ శ్రేణుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం పుష్పరాజ్, మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, భూక్య శ్రీను, ఎస్.కె. అబ్దుల్ నభి, ఎస్.కె. కాసీం, వంకుడోత్ రమేష్, పల్లపు రాజేష్, బొంగు చంద్రశేఖర్, గడ్డం రాజేష్, బానోత్ నరేందర్, వార్డు సభ్యుడు జాటోత్ వీరన్న, వీరసరపు భరత్, సోషల్ మీడియా నాయకుడు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మహేశ్వరంలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

**- అమ్మవారికి బోనాలతో తరలివచ్చిన మహిళలు**
**- ఆలయంలో భక్తుల కోలాహలం**
**- బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న స్థానిక ప్రజా ప్రతి నిధులు**

**మహేశ్వరం, సెప్టెంబర్ 02, ( అనంత జనశక్తి )**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు సోమవారం అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి.
తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను పురస్కరించుకుని మహేశ్వరం పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే మహిళలు పసుపు, కుంకుమ, పూలు, కొత్త చీరలతో అలంకరించిన బంగారు బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పు వాయిద్యాలు, పోతురాజుల నృత్యాలు, కోలాటాల నడుమ భక్తి పారవశ్యంతో ఆలయానికి చేరుకున్నారు.
అమ్మవారికి బోనం సమర్పించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.
ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, పూల అలంకరణలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.చుట్టుపక్కల గ్రామాలైన మన్నాన్‌పల్లి, తుక్కుగూడ, నాగారం, సర్దార్‌నగర్‌తో పాటు మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోర్ల రమేష్, సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్,కాకి ఈశ్వర్, పోల్కం బాలయ్య, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకుల నిరసనతో దద్దరిల్లిన బాలాపూర్

**- ప్రజలకు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**
**- బాలాపూర్ చౌరస్తాలో లో బీఆర్ఎస్ నేతల భారీ నిరసన ర్యాలీ**
**- ముఖ్య అతిథిగా టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి**

**మహేశ్వరం, సెప్టెంబర్ 02, ( అనంత జనశక్తి )**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్‌లో చౌరస్తాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి మండలంలో ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ మండలంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.బాలాపూర్ చౌరస్తాలోని విశాల్ మార్ట్ సమీపం నుంచి బాలాపూర్ మండల కార్యాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ నిరసన ర్యాలీలో ముఖ్య అతిథిగా పట్లోళ్ల యువ నాయకులు కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలకు ఏకంగా 420 హామీలు ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా సరిగ్గా నెరవేర్చలేదు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు నేడు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అరిచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకోవడం మాత్రమే కాకుండా, ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు."ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు మా ఉద్యమ పోరాటం ఆగదు. ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుంది" అని కౌశిక్ రెడ్డి గారు స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రాజీపడదని, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని నాయకులు తెలిపారు.

# బీఎన్ రెడ్డి డివిజన్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

**రంగారెడ్డి సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్**

పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్ రెడ్డి డివిజన్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేసి అనంతరం నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన వారిలో అధ్యక్షులుగా కొమ్ము లింగన్న, ఉపాధ్యక్షులుగా ఇరుగు లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేష్, అధికార ప్రతినిధిగా వాడాకోలా శ్రీకాంత్, కార్యదర్శులుగా తలారి సతీష్, సహాయ కార్యదర్శులుగా కొమ్ము మల్లేష్, ఇరుగు వేణు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా గడికోట మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు

**భక్తి పారవశ్యంలో మహేశ్వరం అమ్మవారికి బోనాలతో మహిళల మొక్కులు**
**పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించిన గ్రామ ప్రజలు**
**బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్వరం ప్రజాప్రతినిధులు**

**మహేశ్వరం, సెప్టెంబర్ 02, ( అనంత జన శక్తి )**



మహేశ్వరం మండల కేంద్రంలోని పురాతన గడికోట మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. సర్పంచ్ మునగపాటి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు, యువతులు తలపై బోనాల కలశాలను ఎత్తుకొని, పసుపు, కుంకుమలతో, సంప్రదాయ బద్ధంగా ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాల నడుమ జరిగిన ఊరేగింపు ఆకట్టుకుంది. భక్తుల జై మైసమ్మ నినాదాలతో గడికోట పరిసరాలు మార్మోగాయి.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ... వర్షా లు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని, ప్రతి ఏటా ఈ బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునగపాటి నవీన్ గౌడ్, ఉప సర్పంచ్ జోర్ల రమేష్, సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, పోల్కం బాలయ్య, మహేందర్ ముదిరాజ్ తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన జబ్బా సాగర్ , జాతోత్ సురేష్ వ్యక్తులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులకు సంబంధించి కొత్తగూడెం 2వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి రవికుమార్ విచారణ జరిపి, ఇద్దరు నిందితులకు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్హెచ్ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామక పత్రాల అందచేత



**రంగారెడ్డి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ ప్రక్రియలో భాగంగా మున్సిపాలిటీ కాలనీలో కోళ్లరు శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం కమిటీ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ హాజరై ఉద్యమ అవశ్యకత, ప్రస్తుత పరిణామాలు, నాయకుల కర్తవ్యాలు, భవిష్యత్ లక్ష్యాలు వివరించి ఎమ్మార్పీఎస్ కమిటీ ప్రకటించడం జరిగింది. అనంతరం మంద కృష్ణ మాదిగ సందేశాన్ని వివరిస్తూ నూతన కమిటీని ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. నూతన కమిటీ లో భాగంగా చైతన్యపురి డివిజన్ అధ్యక్షులుగా చిత్రం పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి గా కళ్యాణ్ బాబు,ఉపాధ్యక్షలుగా కృష్ణ తేజా, కోశాధికారిగా కొల్లూరి వినోద్,ప్రధాన కార్యదర్శిగా బంటీ, ఉపాధ్యక్షులుగా కిట్టు,శివ కార్యదర్శులుగా అభిషేక్, శశి, వినోద్, సహాయ కార్యదర్శిలుగా కార్తీక్ బాబు, అవినాష్ ఎన్నికైనారు.

# అసమానతలు లేని సమాసజాన్ని నిర్మించాలి – మంద కృష్ణ మాదిగ



**రంగారెడ్డి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

అసమానతలు లేని సమాసజాన్ని నిర్మించాలని పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన నాయకులు బుధవారం నాడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగని మర్యాద పూర్వకంగా కలసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ సమాజం లో సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను దీవించారు. ఈకార్యక్రమంలో చంపాపేట్ అధ్యక్షులు బీసన్న మాదిగ, ఉపాధ్యక్షులు మహేష్ మాదిగ, మన్సు రాబాద్ డివిజన్ అధ్యక్షులు కాశీ మాదిగ, ఎం ఎస్ పి అధ్యక్షులు నర్రా శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు గండికోట భీంరాజ్, సీనియర్ నాయకులు బత్తిన సుధాకర్ మాదిగ ప్రకాష్ మాదిగ, రాజు మాదిగ, సురేష్ మాదిగ, నరసింహ మాదిగ, నర్సింగ్ రావు మాదిగ, మౌలాలి మాదిగ, రాజు మాదిగ, చిచ్చా మాదిగ,క్రాంతికుమార్ దేవా మాదిగ, రాము, ప్రకాష్ మాదిగ, బోడగుట్ట రాజు, మాదిగ రాజుకర్, మధు, సునీల్ మాదిగ, రంగన్న మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# జపాన్, జర్మన్ భాషలతో ఎక్కువ ఉద్యోగావకాశాలు

**దిల్లీ:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థులు జపాన్, జర్మనీ భాషలను నేర్చుకుంటే.. ఆ దేశాల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. అందుకే రాష్ట్రంలో వందలాది మందికి జర్మన్ భాష నేర్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బుధవారం ఆయన దిల్లీలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ''జపాన్, జర్మనీ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ పనిచేస్తున్న తెలంగాణ వాళ్లు కలిశారు. అక్కడ ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని, అందుకు ఆ దేశాల భాషలు రావాలని చెప్పారు. అందుకే ప్రభుత్వం విదేశీ భాషలను, నైపుణ్యాలను నేర్పిస్తోంది. టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో మన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.
వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసింది. రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం, 17 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇలా అనేక హామీలను నెరవేర్చింది. నైరాశ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు ఒకరికి మించి ఒకరు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు'' అని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు.

# ఎక్కడా బోర్ కొట్టదు

'స్వతహాగా నాకు కామెడీ సినిమాలంటే చాలా ఇష్టం. బాగుందంటే మళ్లీ మళ్లీ చూస్తుంటా. అలా చూడాలనిపించే సినిమానే 'రోమాంచకం'. యువతరం, కుటుంబ ప్రేక్షకులు కలిసి హాయిగా ఆస్వాదించేలా ఉంటుంది" అన్నారు ప్రణయ్‌రెడ్డి వంగా. ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సోదరుడైన ఈయన నిర్మించిన సినిమానే 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్‌కుమార్ జంటగా నటించారు. వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఈ సందర్భంగా ప్రణయ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ... "ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ యువకుడి చుట్టూ తిరిగే కథ ఇది. పాత్ర ప్రధానమైన ఈ కథలో కడుపుబ్బా నవ్వించే హాస్యం కీలకం. కళాశాల నుంచి బయటికొచ్చిన ఆ యువకుడు ఏం చేశాడు? అతని జీవితంలో ఏం జరిగింది? ప్రేమకథ ఎలా సాగింది? స్నేహితులు ఎంత గందరగోళానికి గురయ్యారనే అంశాలు మంచి వినోదాన్ని పంచుతాయి. ఎక్కడా బోర్ కొట్టకుండా 2గంటల 20 నిమిషాలు సరదా సరదాగా సాగుతుంది. ఇప్పుడు మా అందరి దృష్టి 'స్పిరిట్'పైనే ఉంది. అది పూర్తయ్యాకే మా సంస్థలో చేయనున్న కొత్త సినిమాల గురించి ఆలోచిస్తాం. మంచి కథలు వస్తే తప్పకుండా పరిమిత వ్యయంతో కూడిన సినిమాల్ని నిర్మిస్తాం. వచ్చే ఏడాదికి 'అర్జున్ రెడ్డి' విడుదలై పదేళ్లు అవుతుంది. ఆ సందర్భంగా కొన్ని కొత్త సన్నివేశాల్ని జోడించి మళ్లీ విడుదల చేయాలనే



ప్రణాళికతో ఉన్నాం. 'స్పిరిట్' సినిమా 40 శాతం పూర్తయింది" అన్నారు.

# 'చకోర..' పాట ఆవిష్కరణ

శ్రవణ్, మలైకా టి.వాసుపల్ జంటగా నటిస్తున్న చిత్రం 'చకోర - లూనార్ లవ్‌బర్డ్'. మంగా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబరు 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని 'అద్దంలా చేయనా చిట్టి గుండెని... అందంగా దాచేయంగ జాబిలమ్మని, అరచేత నింపనా చిన్ని ప్రేమని...' అంటూ సాగే గీతాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇటీవల విడుదల చేశారు. హెన్రీ స్వరకల్పనలోని ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చగా, సాయిచరణ్ భాస్కరుని ఆలపించారు. ప్రేమికుడి హృదయంలోని భావాల్ని అందంగా ఆవిష్కరించిన ఈ గీతానికి మంచి స్పందన లభిస్తోందని సినీ వర్గాలు చెప్పాయి.

# జబర్దస్త్‌లో మళ్లీ పాత జోష్.. వారి ఎంట్రీతో రష్మీ ఎమోషనల్!



బుల్లితెరపై ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్న కామెడీ షో 'జబర్దస్త్'. ఒకప్పుడు స్టార్ కమెడియన్లతో కళకళలాడిన ఈ షో.. ప్రస్తుతం మళ్లీ తన పూర్వ వైభవాన్ని సొంతం చేసుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా గతంలో జబర్దస్త్‌కు వెన్నెముకగా నిలిచిన పలువురు కమెడియన్లను తిరిగి షోలోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు జబర్దస్త్‌లోకి జడ్జిగా రీ ఎంట్రీ ఇచ్చారు. ఆయన రాకతో షోకు మళ్లీ పాత కళ వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమెడియన్ల మధ్య పోటీ పెంచేందుకు నాగబాబు కూడా ప్రత్యేక ఆఫర్లు, ఛాలెంజ్‌లు ప్రకటిస్తూ షోపై ఆసక్తిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో జబర్దస్త్‌లో తమ కామెడీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పలువురు కమెడియన్లు తిరిగి ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటికే హైపర్ ఆది, ధనాధన్ ధన్‌రాజ్, చలాకీ చంటి, సద్దాం, వినోద్ అలియాస్ వినోదిని తదితరులు జబర్దస్త్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చారు. తమదైన పంచ్‌లు, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి మరో ఇద్దరు క్రేజీ కమెడియన్లు చేరారు. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్న సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను కూడా చాలా రోజుల తర్వాత జబర్దస్త్ వేదికపై కనిపించారు. ఈ ఇద్దరూ కలిసి కనిపించడంతో షో అభిమానుల్లో ఒక్కసారిగా పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. 'కామెడీ కింగ్స్ ఈజ్ బ్యాక్' అంటూ మేకర్స్ విడుదల చేసిన తాజా ప్రోమో సోషల్ మీడియాలో ఆసక్తిని పెంచుతోంది. ఎప్పటిలాగే సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను తమదైన కామెడీ పంచ్‌లు, ప్రాసలతో ప్రేక్షకులను నవ్వించారు. యాంకర్ రష్మీతో కలిసి వీరిద్దరూ చేసిన కామెడీ కూడా ప్రోమోలో హైలైట్‌గా నిలిచింది.

# నటి మమితా బైజుకు అస్వస్థత..

నటి మమితా బైజు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో ఆమె ఆసుపత్రిలో చేరారు. సెప్టెంబర్ 5న ఆస్ట్రేలియాలో జరగనున్న 'క్లైడ్ ఓనం 2026' వేడుకలకు మమితా బైజు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అనారోగ్యం కారణంగా ఈ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని క్లైడ్ మలయాళీ అసోసియేషన్ వెల్లడించింది. ఓనం వేడుకలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ ఓ వీడియో పంచుకుంది. అందులో మమిత మాట్లాడుతూ.. వైద్యుల సలహా మేరకు ప్రయాణం చేయలేకపోతున్నందుకు క్షమాపణలు చెప్పారు . త్వరలోనే అభిమానులను కలుసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక మమిత వరుస విజయాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆమె నటించిన మూడు చిత్రాలు నెల రోజుల వ్యవధిలోనే విడుదలై ఘన విజయాన్ని అందుకున్నాయి. ప్రస్తుతం ఆమె నటించిన మలయాళ చిత్రం 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' తెలుగు విడుదలకు సిద్ధంగా ఉంది. సెప్టెంబర్ 4న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.



# అందుకే కోహ్లీ-అనుష్క లండన్‌లో స్థిరపడ్డారు..!



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కుటుంబంతో కలిసి కొన్నాళ్లుగా లండన్‌లో నివాసం ఉంటున్న సంగతి తెలిసిందే. టీమ్ఇండియా మ్యాచ్‌లు ఉన్నప్పుడు, ఐపీఎల్ సీజన్ సమయంలో మాత్రమే అతడు భారత్‌కు వస్తున్నాడు. దీంతో కోహ్లీ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యాడు. అయితే, విరాట్ భారత్‌ను వీడి లండన్‌లో నివసించడానికి గల కారణాన్ని బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ భర్త డా.శ్రీరామ్ నేనే తాజాగా బయటపెట్టారు. లండన్‌కు వెళ్లడానికి ముందు అనుష్క శర్మతో జరిపిన ఆసక్తికర సంభాషణను డా. శ్రీరామ్ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడి యాతో జరిగిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. తమకున్న స్టార్‌డమ్ కారణంగా భారత్‌లో కోహ్లీ-అనుష్క సాధారణ జీవితాన్ని గడపలేకపోతున్నారని, అందుకే లండన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు.

పబ్లిక్ అటెన్షన్‌కు దూరంగా ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కోహ్లీ దంపతులు తమ పిల్లలు వామికా, అకాయ్‌లను మీడియా దృష్టికి దూరంగా ఉంచి సాధారణంగా పెంచా లనుకుంటు న్నారని తెలిపారు. మరోవైపు, టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన కోహ్లీ.. వన్డే మ్యాచ్‌లు, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో భారత్‌కు వస్తున్నాడు. ఇక, 2018లో విడుదలైన 'జీరో' చిత్రం తర్వాత అనుష్క శర్మ నటనకు దాదాపు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత ఆమె 'చక్దా ఎక్స్‌ప్రెస్'లో నటించారు. ఇందులో అనుష్క మాజీ భారత క్రికెటర్ ఝులన్ గోస్వామి పాత్రను పోషించారు. అయితే, ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. ఆమె 2022లో తన నిర్మాణ సంస్థ 'క్లీన్ స్లేట్ ఫిల్మ్స్' బాధ్యతల నుంచి వైదొలిగి కుటుంబ బాధ్యతలు చూసుకుంటోంది.

# మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం.. మ్యాచ్‌లు ఎప్పుడంటే?




ఐసీసీ మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ కి భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. మ్యాచ్‌లు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (ముంబయి), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. కటాఫ్ డేట్ అయిన జులై 6 నాటికి మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో ఉన్న జట్లు ఇందులో పోటీపడనున్నాయి. ఈ లెక్కన ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్న పాకిస్థాన్ ఈ టోర్నమెంట్‌కు దూరమైంది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్-2లో నిలిచిన టీమ్‌లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

వాస్తవానికి, ఈ టోర్నీ శ్రీలంకలో జరగాల్సి ఉండగా.. శ్రీలంక క్రికెట్ బోర్డు పరిపాలన వ్యవహారాల్లో ఆ దేశ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్న కారణంగా ఆతిథ్య హక్కులను కోల్పోయింది. టోర్నమెంట్ నిర్వహణకు బంగ్లాదేశ్, భారత్, దక్షిణాఫ్రికాలను ఆప్షన్లుగా పెట్టుకున్న ఐసీసీ చివరకు ప్రత్యామ్నాయ ఆతిథ్య దేశంగా భారత్‌ను సిఫార్సు చేసింది. ఈ నిర్ణయాన్ని సెప్టెంబర్ 2న ఐసీసీ బోర్డు ఆమోదించింది.

# ఫీల్డింగ్ కోచ్ కోసం లింక్డ్‌ఇన్‌లో పాక్ పోస్టు.. సోషల్ మీడియాలో ట్రోలింగ్




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరోసారి వార్తల్లో నిలిచింది. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో ఘోర పరాజయం తర్వాత ప్రధాన కోచ్ సర్ఫ రాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి, ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపిన మరుసటి రోజే పీసీబీ మళ్లీ వార్తల్లోకెక్కింది. మొన్నటివరకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న షేన్ మెక్‌డెర్మాట్ పదవీకాలం జులైలో ముగిసింది. ప్రస్తుతం ఆ పదవి ఖాళీగా ఉంది. ఫీల్డింగ్ కోచ్ పదవిని భర్తీ చేయడానికి పాకిస్థాన్ దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే, ఇందులో వింతేముంది అంటారా.. ఆగండి అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది మరి. కోచ్ నియమకానికి పీసీబీ ఏకంగా లింక్డ్‌ఇన్‌లో ఓపెన్ హైరింగ్ మొదలు పెట్టింది. పాకిస్థాన్ బోర్డు ఎంచుకున్న ఈ విధానా న్ని సోషల్ మీడియాలో నెటిజన్లు తెగ ట్రోల్ చేస్తున్నారు. తమదైన శైలిలో విమర్శలు, సెటైర్లతో ఆటాడుకుంటున్నారు. "నాకు ఆశ్చర్యంగా ఉంది! పీసీబీలో ఉద్యోగాల భర్తీ పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతోందా? ఇక్కడ సిఫార్సులు, పలుకుబడి ఏమీ పనిచేయవా?" అని ఓ యూజర్ వ్యంగ్యంగా స్పందించాడు. "దీన్ని ఇక్కడ ఎందుకు పోస్ట్ చేస్తున్నారు?ఆ పని కోసం నేరుగా ఏదైనా రిటైర్డ్ మిలిటరీ లేదా ఆర్మీ సిబ్బందిని సంప్రదించండి" అని మరో యూజర్ సెటైర్ వేశాడు. "దీనికి దరఖాస్తు చేద్దామని అనుకుంటున్నాను. గత 13 ఏళ్లుగా నేను ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో పనిచేశాను. ఏం జరుగుతుందో చూద్దాం" అని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. "ఈ పదవి గురించి ఆసక్తిగా ఉంది.. మొన్న రెండు క్యాచ్‌లు డ్రాప్ చేశా" అని మరో యూజర్ వ్యంగ్యంగా అన్నాడు.

# పాక్ క్రికెటర్ 'ఫేక్ ఇంజూరీ'పై విచారణ!

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు సమయంలో గాయం కారణమని చెప్పి పాక్ క్రికెటర్ ఇమామ్ ఉల్ హక్ బ్యాటింగ్‌కు దిగలేదు. కండరాలు పట్టేశాయని చెప్పి.. రెండు ఇన్నిగ్స్‌ల్లోనూ డగౌట్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి గాయంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పాకిస్థాన్ మాజీ చీఫ్ సెలక్టర్ మహ్మద్ వాసిమ్ కూడా ఇమామ్ గాయాలపై విమర్శలు చేశాడు. గతంలోనూ ఇమామ్ ఇలానే వ్యవహరించాడంటూ ఆరోపించాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ కీలక ప్రకటన చేశారు. ఇమామ్ గాయంపై విచారణ చేపడతామని వెల్లడించారు. "విచారణ చేయబోతున్నాం. కండరాలు పట్టేయడంతో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతడు బ్యాటింగ్‌కు రాలేదు. ఇది సాధ్యమా? లేకపోతే ఇందులో ఏమైనా మతలబు ఉందా? అనేది దర్యాప్తు చేస్తాం. గాయాలు కావడం ఆటగాళ్లకు సహజమే. గతంలో పలువురు చేతికి లేదా కాలుకు గాయమైనా సరే కట్లు కట్టుకొని మైదానంలోకి దిగిన సందర్భాలనూ చూశాం. కానీ, ఇప్పుడు ఇమామ్ అంశంలో పరిస్థితి భిన్నమైంది. తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం" అని జావెద్ వెల్లడించారు. ఈ క్రమంలో ఇమామ్ కూడా న్యాయ సలహా కోసం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రెండు టెస్టుల్లోనూ ఓడిపోవడంతో పాకిస్థాన్ ఏడుగురిపై వేటు వేసింది. అందులో ఇమామ్ కూడా ఉండటం గమనార్హం.

మరోవైపు ఇమామ్ తనకు నిజంగానే గాయమైనట్లు తెలియజేయాలనే ఉద్దేశంతో షార్ట్ ధరించి పట్టీలు వేసుకొని మరీ వార్మప్ చేస్తూ కెమెరాల్లో కనిపించాడు. దీనిపై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. నిజంగా గాయమైతే ఇలాంటి డ్రామాలు చేయనక్కర్లేదన్నాడు.

**బాబర్‌కు తీవ్ర జ్వరం?**

దారుణమైన ఆటతీరుతో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. ఆ జట్టు కెప్టెన్ బాబర్ అజామ్ హై ఫీవర్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ నెల 9న జరిగే మూడో టెస్టులో ఆడతాడా? లేదా? అనేది అనుమానంగా మారింది. అయితే, అతడు కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తాడనే నమ్మకం ఉందని పీసీబీ వర్గాలు పేర్కొన్నాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945